నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నల్లగొండ
బుధవారం సెప్టెంబర్ 04,2024 www.navatelangana.com

ఇంటింటి ఓటర్ సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్



నవతెలంగాణ -హాలియా

మండలంలోని హాలియాలో సాయి ప్రతాప్ నగర్ రెడ్డి కాలనీ బొడ్రాయి బజార్‌లో మంగళవారం జరుగుతున్న ఇంటింటి ఓటరు జాబితా సర్వేను జిల్లా అడిషనల్ రెవెన్యూ జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని మొత్తం ఓటర్లు 9376 మందికి గాను 25శాతం ఆన్‌లైన్ చేసినట్టు తెలిపారు. ఈ హౌస్ టు హౌస్ సర్వే ఈనెల 13వ వరకు మండలంలోని 44 పోలింగ్ కేంద్రాల పరిధిలోని అందరూ ఇంటింటికి తిరిగి ఆధార్ లేనివారికి ఆధార్ సేకరణ ఫోన్ నెంబర్ లేని వారికి ఫోన్ నెంబర్ సేకరణ పేర్లు తప్పొప్పులు లాంటివి ఆన్లైన్ ఆప్ నందు సరి చేస్తామని తెలిపారు. ఆయన వెంట తహసిల్దార్ జయశ్రీ ,బి ఎల్ లు అక్బర్, విజయ, నర్మదా పాల్గొన్నారు.

దివిస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మెటీరియల్ అందజేత

నవతెలంగాణ- చిట్యాల

దివిస్ లేబరేటరీస్ లిమిటెడ్ కంపెనీ వారు మంగళవారం మండలం లోని ఏపూరు, పేరేపెల్లి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ,ప్రాథమికోన్నత పాఠశాలలలో సుమారు 4,70,000 విలువగల స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్, వాటర్ బాటిళ్లు ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శుల మల్లేష్ ,అహల్యల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సబిత మాట్లాడుతూ దివిస్ కంపెనీ యాజమాన్యం వారు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పి స్తూ విద్యార్థుల చదువులకు ఎంతగానో తోడ్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యా కమిటీ చైర్మెన్ జి.రజిత, మండల పరిషత్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు జి.అంజయ్య, దివిస్ అధికారులు జి.వెంకటేశ్వర్లు, ఎస్ .సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మందుల కొరత... రోగుల వెత

- ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో దుస్థితి
- అసౌకర్యానికి లోనవుతున్న రోగులపై పట్టింపు కరువు
- తీవ్ర ఆవేదనలో రోగులు
- ఆస్పత్రి పై నిత్యం పర్యవేక్షణ ఉండాలంటున్న ప్రజలు
- అభివృద్ధి కమిటీ ఏం చేస్తుందని సూటి ప్రశ్న



గత నెల 28 న ఉదయం 10 గంటలకు జ్వరం, వాంతులు ఎక్కువగా వస్తున్నాయని మల్లయ్య అనే ఓ వ్యక్తి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వచ్చాడు. వైద్యునితో చూయించుకున్నాకా అవసరమైన మందులు ఆస్పత్రిలో అందుబాటులో లేకపోవడంతో బయట దుకాణంలో తెచ్చుకోవాలని వైద్యులు చీటి రాసిచ్చారు. మల్లయ్య సోదరుడు రూ.300 వెచ్చించి ప్రైవేటులో తీసుకొచ్చారు. అప్పటికే మల్లయ్యకు జ్వరం మరింత తీవ్రం కావడంతో ప్రైవేట్ ఆస్పత్రిని సంప్రదించారు. ప్రభుత్వజనరల్ ఆస్పత్రిలో మందుల కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు అని చెప్పడానికి పై విషయం ఒక ఉదాహరణ మాత్రమే.

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్

ఇక్కడ తగిన వైద్యసేవలు అందుతాయన్న ఆశతో వస్తున్న రోగులకు వ్యయ ప్రయాసలు తప్పడం లేదు. ఓ వైపు వైద్యుల నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోతుండగా.. మరోవైపు రోగులకు అవసరమైన మందులు మందుల కొరత పట్టిపీడిస్తోంది. దీంతో వైద్యులు ప్రైవేటుగా తెచ్చుకోవాలని చీటి రాసిస్తున్నారు. విధిలేక వందల రూపాయలు వెచ్చించి మందులు తెచ్చుకుంటున్నారు. ఎందుకు అందుబాటులో లేవని ఎవరైనా ప్రశ్నిస్తే... అవేమి తమకు తెలియదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. స్టోర్లో నిల్వను బట్టి మందులను అందుబాటులో ఉంచాల్సిన అధికారులు తమకు ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా రోగులు, వారి సహాయకులు నానా అగచాట్లు పడాల్సి వస్తోంది. అసలే వ్యాధుల కాలం కావడంతో ఆసుపత్రికి రోగుల తాకిడి ఎక్కువైంది. ఈ సమయంలో జ్వరానికి సంబంధించిన మందులు కూడా లేకపోవడంతో రోగుల బాధ వర్ణనాతీతంగా మారింది.

అందుబాటులో లేనివి...

విషద్రావణం తాగిన వారు, వాంతులు, విరేచనాలు, శరీరంలో యాసిడ్లు ఎక్కువైన వారికి, తీవ్ర జ్వరాల బారిన పడిన రోగులకు తగిన మందుల కొరత ఉన్నట్లు కొందరు వైద్యులే చెప్పడం గమనార్హం. అత్యవసర చికిత్సా విభాగంలో చేరే ఎక్కువ శాతం మంది వినియోగించే సోడియం వాలీ యేట్, లెవిప్రిల్, ప్యాంటాప్, డాక్సీ సెక్లిన్, ఐవీ మెట్రోజిల్ ఫ్లూయిడ్స్, అమాక్సిక్లావ్ తో పాటు సర్జికల్ స్పిరిట్, ఇవే కాకుండా సాధారణ జ్వరానికి అవసరమయ్యే పారాసిటమాల్, పాన్ టాప్ ప్రోజోల్, డైక్లోఫెనాక్ టాబ్లెట్, డైక్లో ఫెనాక్ ఇంజక్షన్, ఓ ఆర్ ఎస్ పౌడర్, ఆంట్రం, అదేవిధంగా సర్జికల్ కు సంబంధించి ప్రధానంగా ఉపయోగపడే సిరంజీలు అందుబాటులో లేవు. 2 సిసి, 5 సిసి,10 సిసి సిరంజీలు, సిక్స్ అండ్ ఆఫ్ గ్లౌజులు, ఎగ్జామినేషన్ గ్లౌజులు, ఇవేవీ కూడా అందుబాటులో లేవు.

సూపరింటెండెంట్.. మెడికల్ స్టోర్ నిర్వాహకుల సమన్వయ లోపం....

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపర్డెంట్, మెడికల్ స్టోర్ నిర్వాహకుల సమన్వయ లోపంతో వివిధ ఆరోగ్య సమస్యలతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చే ప్రజలు ఆరోగ్య సేవలు పొందుటలో ఇబ్బందులు ఎదురుకోవలసిన దుస్థితి ఏర్పడింది. వాస్తవానికి ఏ మందులు అందుబాటులో ఉన్నాయో, ఎ మందులు అందుబాటులో లేవో ప్రజలకు మందులను ఇచ్చే స్టోర్ల దగ్గర విధిగా ప్రదర్శించాలి. ఇక్కడ అలా జరగడం లేదు. బయటి మెడికల్ షాప్ లతో డాక్టర్లు బేరసారాలు కుదుర్చుకొని పేషెంట్లకు ఇవ్వాల్సిన మందులు అందుబాటులో లేనివి రాసి పేదవారి జేబులు ఖాళీ చేస్తూ, మెడికల్ షాపుల యాజమాన్యాల జేబులు నింపుతూ, ఆర్థిక లావాదేవుల చేసుకుంటున్నారని ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఎన్నిసార్లు విషయాన్ని వైద్యుల వద్ద ప్రస్తావించిన పట్టి పట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు తప్ప వారిలో మార్పు రావడంలేదని పేర్కొంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు కావలసిన మందులను అందుబాటులో ఉంచే విధంగా చూడటమే కాకుండా, మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

జాడ లేని అభివృద్ధి కమిటీ..!

ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన సేవలందించేందుకు ఉద్దేశించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ జాడ లేకుండా పోయింది. కమిటీ ఉన్నట్లు కూడా ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది. కమిటీ సమావేశంలో ఆసుపత్రిలో లోటుపాట్లను సరిదిద్దుకోవాల్సి ఉన్నా పట్టింపులు కొరవడ్డాయి. జిల్లా కలెక్టర్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్, డిసిహెచ్ఎస్, డిఎంహెచ్ఓ, శాసనసభ్యులతో పాటు వివిధ వర్గాల సభ్యులు ఉంటారు. వీరి సూచనలు, సలహాలు పాటించి రోగులకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాల్సి ఉంది.

పేరుకే పెద్ద ఆస్పత్రి :దాసు (నల్లగొండ)

పేరుకే పెద్ద ఆస్పత్రి తప్ప కనీస వసతులు లేవు.కలెక్టర్ ఎన్నిసార్లు సీరియస్ గా చెప్పినా కలెక్టర్ మాట కూడా వినటం లేదు. ఇక్కడ మందులు అందుబాటులో లేవు. డాక్టర్లు సరిగా స్పందించరు. అందుబాటులో ఉండరు. సమయానికి రారు. అధికారుల దగ్గరికి వెళితే మందులు ఉన్నాయని చెబుతారు. రోగులకు మాత్రం డాక్టర్లు మందులను రాసినప్పుడు అవి మెడికల్ స్టోర్ లో మాత్రం దొరకడం లేదు. బయట తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. నాలాంటి పేదవాళ్లకు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే ఏం న్యాయం జరుగుతున్నట్టు.

అందుబాటులోకి రాని సూపరిండెంట్...

మందుల కొరత విషయమై ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపర్డెంట్ ను నవతెలంగాణ ఫోన్లో సంప్రదించగా ఫోన్ స్విచ్ ఆఫ్ గా వచ్చింది.

మందులు అన్ని అందుబాటులో ఉన్నాయి

డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి (డీసీఎస్ ఆర్ఎంఓ)

ప్రభుత్వాస్పత్రిలో రోగులకు కావలసిన మందులు అన్ని అందుబాటులో ఉన్నాయి. ఎలాంటి కొరత లేదు.

అభివృద్ధి పనులు, సీజనల్ వ్యాధుల పై అప్రమత్తత అవసరం



నవతెలంగాణ - చండూరు

అభివృద్ధి పనులు, సీజనల్ వ్యాదుల పై అధికారుల అప్రమత్తత అవసరమని అని నల్గొండ జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన చండూరు మున్సిపాలిటీలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో కలిసి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మున్సిపల్ పరిధిలో అలాగే చండూరు మండలంలో చేపట్టిన పనులు,ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గ్రామపంచాయతీ మొదలుకొని మండల, మున్సిపల్ స్థాయి వరకు అధికారులు అందరూ సక్రమంగా పనిచేయాలని ,విద్య ,వైద్యంపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని ,ప్రజలకు కనీస సేవలైన తాగునీరు, రోడ్లు, పారిశుధ్యం, విద్య ,వైద్యం ,విద్యుత్ ,ధరణి తదితర సేవలను సక్రమంగా అందించేలా చూడాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణంలో భాగంగా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా స్థలాలను చూడాలని, మండలంలోని సబ్ సెంటర్లను సరైన ప్రాంతాలలో నిర్మించేందుకు నాలుగైదు రోజుల్లో స్థలాలు చూడాలని, ఇందుకు అవసరమైన అంచనాలను రూపొందించి పంపాలన్నారు.. ఉన్నత పాఠశాల మరో రెండు పాఠశాలలపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించి నాణ్యత పై దృష్టి సారించాలని, ఎంపిక చేసిన పాఠశాలల్లో తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్ పక్కగా ఉండేలా చూడాలని, అలాగే ల్యాబ్ లు, కనీసం మూడు క్రీడలపై సామాగ్రి ఏర్పాటు చేయాలని, ప్రత్యేకించి చండూరు హైస్కూల్ పై ఎక్కువ దృష్టి సారించాలని, ఆదేశించారు. మండలం , మున్సిపాలిటీ పరిధిలోని అన్ని శాఖల పనితీరుని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సందర్భంగా నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు.వసతిగృహాల్లో విద్యుత్ సర్క్యూట్ కాకుండా తగిన చర్యలు తీసుకుంటూనే విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలన్నారు. చండూరు రెవెన్యూ డివిజన్ అయిన సందర్భంగా ఆర్డిఓ ఎమ్మార్వో ఎంపీడీవో ఇతర ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. అంతకుముందు ఆయన మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో కలిసి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని, అలాగే జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలల స్కావెంజర్ల కోసం డిఎంఎఫ్టి నుండి నిధులను విడుదల చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ ,ఆర్డీవో సుబ్రహ్మణ్యం,ప్రజారోగ్య ఈ ఈ సత్యనారాయణ ,మున్సిపల్ కమిషనర్, స్థానిక తహసిల్దార్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు కాంగ్రెస్ నాయకులు కొరిమి ఓంకారం,దోటి వెంకటేష్ యాదవ్, డాక్టర్ కోడి శ్రీనివాసులు అనంత చంద్రశేఖర్ గౌడ్, నల్లగంటి మల్లేష్, కోడి గిరిబాబు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థులను తరలించాలని మోడల్ స్కూల్ విద్యార్థుల ధర్నా

- ఎమ్మెల్యే హామీఇవ్వడంతో ధర్నా విరమణ



నవతెలంగాణ -వేములపల్లి

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలోని హాస్టల్లో ఉన్న కేజీబీవీ విద్యార్థులను తరలించాలని మంగళవారం ఆదర్శ పాఠశాల విద్యార్థులు పాఠశాల గేటు ముందు ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ధర్నా నిర్వహించారు. వివరాల్లోకి వెళితే మాడుగుల పల్లి మండలానికి చెందిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన సుమారు 350 మంది విద్యార్థులకు బోధన,వసతి భవనం లేకపోవడంతో మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల లోని వసతి గృహానికి నెల రోజుల కిందట తరలించారు. దీంతో మండల కేంద్రానికి చెందిన మోడల్ స్కూల్ విద్యార్థులు సామర్థ్యానికి మించి విద్యార్థులు ఉండటం వల్ల అసౌకర్యానికి గురవుతామని వ్యతిరేకించారు. ఎన్నో మార్లు తమ సమస్యలపై అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోకపోవడంతో మూడుసార్లు ఆదర్శ పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. అధికారులు వచ్చి హామీ ఇస్తున్నారు. తప్ప అమలు చేయడం లేదు. దీంతో ఆగ్రహానికి గురైన ఆదర్శ పాఠశాల విద్యార్థులు మంగళవారం ఆదర్శ పాఠశాల ఎదుట ఉదయం నుండి పాఠశాల ప్రధాన గేట్లను మూసివేసి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ధర్నా నిర్వహించారు. దీంతో ఆదర్శ పాఠశాల మధ్యాహ్నం వరకు మూతపడి ఉంది. ఉన్నతాధికారులకు సమాచారం అందించి విద్యార్థులకు చేరవేసిన శాంతించలేదు. మూడుసార్లు తమను మోసగించారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి తెలియజేయడంతో అక్కడికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు. కేజీబీవి విద్యార్థులను రెండు రోజుల్లో ఇక్కడి నుంచి వేరే భవనంలోకి తరలిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆదర్శ పాఠశాల లోని వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థుల అవస్థలను తెలుసుకున్నారు .ఆదర్శ పాఠశాలలో వందమంది విద్యార్థులకు సామర్థ్యం ఉండగా సుమారు 450 మంది విద్యార్థులను ఉంచడం వల్ల డైనింగ్ హాల్లో, వసతి గృహాల్లోనే విద్య బోధన నిర్వహిస్తున్నట్లు దృష్టికి వచ్చింది. వెంటనే జిల్లా విద్యాధికారితో మాట్లాడి రెండు రోజుల్లో మిర్యాలగూడ మండలంలోని శ్రీనివాస్ నగర్ సమీపంలోని భవనంలోకి తరలించాలని కోరారు. స్పందించిన అధికారులు తరలిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా స్థానిక ఆదర్శ పాఠశాలలో మంచినీటి వసతి, వాచ్మెన్ అవసరం ఉందని సమస్యలు విన్నవించడంతో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పుట్టల కురుపయ్య, ఎంఈఓ బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థులకు శాశ్వత పరిష్కారం చూపాలి:

కేజీబీవీ విద్యార్థులకు శాశ్వత భవనాలు నిర్మించి విద్యాబోధన అందించాలని కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు రెమిడాల పరుశు రాములు, సిపిఎం మండల కమిటీ సభ్యులు వి సైదులు గౌడ్ మాడుగులపల్లి మండల కార్యదర్శి రోండి శ్రీనివాస్ లు అన్నారు. విద్యార్థులకు అద్దెభవనాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పాలకులు పక్కా భవనాలు నిర్మించకపోవడం వల్ల విద్యార్థులు పలుమార్లు విద్యాలయాన్ని వివిధ ప్రదేశాలకు మారుస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ స్థలాలు గుర్తించి పక్క భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

వాగులో చిక్కుకున్న వారిని కాపాడిన ఎమ్మెల్యేలు

- డిండి ప్రాజెక్టును సందర్శించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ



నవతెలంగాణ -డిండి

ఇటీవల కురిసిన వర్షాలవల్ల దుందుభి నది ప్రవాహం ఉధృతం కావటం వల్ల డిండి ప్రాజెక్టు నిండి పారుతున్నది. నిత్యం డిండి వాగు పరిసర గ్రామాల ప్రజలు వాగు దాటి తమ పశువులను మేపుకొనేందుకు వెళుతుంటారు. వాగులో చేపలు పట్టుకుంటుంటారు. ఆదివారం చేపలు పట్టేందుకు డిండి మండలం గోనబోయినపల్లి గ్రామానికి చెందిన 10 మంది వాగులోకి వెళ్లారు.. ప్రాజెక్టు అకస్మాత్తుగా నిండి పొంగి పర్లటం వల్ల వాగు ఉధృతంగా రావటంతో వారు వాగు మధ్యలో నాగర్‌కర్నూలు జిల్లా సిద్దాపురం శివారులో రాతి బండపై వరద మధ్యలో చిక్కుకున్నారు. విషయం తెలుసుకున్న దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలూనాయక్, అచ్చంపేట శాసనసభ్యులు వంశీకృష్ణ, డిండి సిఐ సురేష్, అధికారులు వాగులో చిక్కున్న వారి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారిని బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. వాగు బాగా ప్రవహించటంతో గజ ఈతగాళ్లను పిలిపించి మంగళవారం ఉదయం 7 గంటలకు సిద్ధాపురం సమీపంలోని డిండి వాగు వద్దకు చేరుకొని వరద బాధితులను కాపాడారు. ఈ సందర్భంగా బాలూనాయక్, వంశీకృష్ణ తో వరదబాదితులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బాలూనాయక్ మాట్లాడుతూ... ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల మృతిచెందిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాను 4 లక్షల నుండి 5 లక్షల రూపాయలకు ప్రభుత్వం పెంచిందన్నారు. వర్షాల వల్ల పూర్తిగా దెబ్బతిన్న పంటలకు ఎకరానికి 10 వేల రూపాయలు పంటనష్టం చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్‌రావు, డిండి ఎస్సై బి.రాజు, బొల్లె శైలేష్, కాంగ్రెస్ నాయకులు, మేకల కాశన్న, బాదమోని శ్రీనివాస్‌గౌడ్, నూకం చంద్రయ్య, బద్దెల శ్రీనివాసులు, గడ్డమీది సాయి, బల్మూరి సాయిబాబు, పోలం లక్ష్మణ్, ఖలీమ్ తదితరలు పాల్గొన్నారు.

దుందుభి మాతకు జలహారతి

రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల వాగులు, వంపులు నిండి రాష్ట్రం జలకళగా మారింది. హైదరాబాద్ - శ్రీశైలం హైవేపై డిండి మండల కేంద్రం ప్రక్కన ఉన్న డిండి ప్రాజెక్టు నిండి అలుగు పారుతున్నది. ఈ సందర్భంగా దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలూనాయక్ తన సహచర ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి మంగళవారం డిండి వాగులో చిక్కుకున్న వరదబాధితులను కాపాడి డిండి ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా దుందుభిమాత కు పుష్పాలు సమర్పించి పూజలు నిర్వహించి అనంతరం జలహారతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చందంపేట, నేరెడుగొమ్ము, దేవరకొండ మండల పరిధిలోని చెరువులు, కుంటలను నింపేందుకు డిండి మండలంలోని కామేపల్లి వద్ద కాలువ ద్వారా నీటి విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతును రాజు చేయడం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో డిండి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్‌రావు, దేవరకొండ మాజీ మార్కెట్‌కమిటీ చైర్మెన్ ముక్కమల్ల వెంకటయ్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలి

- జిల్లా విద్యాధికారి బొల్లారం బిక్షపతి

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

ఇంటర్మీడియట్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని జిల్లా విద్యాధికారి బొల్లారం బిక్షపతి ఆదేశించారు. మంగళవారం తుంగపాడులోని ఆదర్శ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి ఇంటర్మీడియట్ విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. సైన్స్ విద్యార్థులు పాఠ్యాంశాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండి గ్రాడ్యుయేషన్ లో తీసుకునే కోర్సులపై ఇప్పటినుండే ప్రణాళికలు తయారు చేసుకునే విధంగా ఉపాధ్యాయులు తరవుగా కెరీర్ గైడెన్స్ పై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. డిజిటల్ పద్ధతిలో పాఠ్య బోధన అనంతరం



పాఠ్యపుస్తకాలలోని పాఠ్యాంశాలను చదివించాలని తెలిపారు. అనంతరం మాడుగులపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మార్చుటకు శ్రీనివాస్ నగర్ లో ప్రైవేట్ భవనాన్ని పరిశీలించి త్వరగా మరమ్మతులు చేసి రెండు రోజుల్లో అందుబాటులో తేవాలని మండల విద్యాధికారిని ఆదేశించారు. ఆయన వెంట మండల విద్యాధికారి ఎం బాలాజీ నాయక్, ప్రిన్సిపాల్ దీన సుజాత, ప్రత్యేక అధికారి పార్వతి తదితరులు ఉన్నారు.

జ్వరం సర్వే పరిశీలన

నవతెలంగాణ - నాంపల్లి

మండలంలోని నేరళ్లపల్లి, జాన్ తండా, నరసింహులగూడెం గ్రామాలలో జరుగుతున్న జ్వర సర్వేను మంగళవారం ఎంపీడీవో మేరీ స్వర్ణకుమారి, ఎంపీఓ ఝాన్సీ, మండల వైద్యాధికారి డాక్టర్ తరుణ్, ఎంఎల్ హెచ్ పి సంతోష పరిశీలించారు. అదేవిధంగా స్థానిక అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. భారీ వర్షాలు కురిస్తున్న నేపథ్యంలో విష జ్వరాలు ప్రబలే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు .ఇందులో భాగంగా గ్రామ పంచాయతీ సిబ్బందితో శానిటేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణి, ఏఎన్ఎం లక్ష్మి, సంతోష ,అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలి



నవతెలంగాణ- కొండమల్లేపల్లి

తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు పెరుగుతున్నటువంటి ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మం పాటి శంకర్లు అన్నారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చండూరు నుండి చేపట్టినటువంటి మోటర్ సైకిల్ ఫోర్ యాత్ర మంగళవారం కొండమల్లేపల్లికి చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక చౌరస్తా సెంటర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చేరుకొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని అదేవిధంగా విద్యార్థులకు పాఠశాల సమయం 7 గంటలకే నిర్ణయించడం వల్ల విద్యార్థులకు ఉదయం పూట సమయం సరిపోక బాత్రూంల వద్ద, స్నానాల గదుల వద్ద విద్యార్థులు క్యూ లైన్ లలో నిలబడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే అధికారులు విద్యార్థులకు 7 గంటల సమయం నుంచి 8 గంటల వరకు సమయపాలన ఆలోచించాలని 9 నెలలు గడుస్తున్న విద్యార్థులకు మెస్ చార్జీలను విడుదల చేయలేదని ఈ నెల 10వ తేదీన ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహిళా కో కన్వీనర్ కుంచం కావ్య, జిల్లా ఉపాధ్యక్షులు రామావత్ లక్ష్మణ్ నాయక్, కుర్ర సైదా, బుడిగ వెంకటేష్, కోరే రమేష్, ముస్కు రవీందర్, జగన్, వీరన్న, సాయి, పావని, మౌనిక ,స్పందన ,రవి, కిరణ్, సంపత్, నవదీప్, ప్రవీణ్ ,న్యూమన్ , ఇద్ధి రాములు తదితరలు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వండి

- ఐద్వా జిల్లా ప్రధానకార్యదర్శి పాలడుగు ప్రభావతి



నవతెలంగాణ-క్లాక్‌టవర్

మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, బాధితులకు న్యాయం జరగడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక దొడ్డికొమరయ్య భవనంలో ఆ సంఘం మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి పాలకులు ప్రజా సమస్యలను విస్మరించారన్నారు. మహిళల భద్రత గాలికొదిలేసారన్నారు. మహిళలకు రక్షణ చట్టాలను తయారు చేసి నిందితులను కఠినంగా శిక్షలు పడే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో విషజ్వరాలు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, మద్యం ఎరులే పారుతుందని మద్యాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల కార్యదర్శి కొండ అనురాధ, అధ్యక్షురాలు గోలి వెంకటమ్మ, సహయ కార్యదర్శి తంతనపల్లి సైదమ్మ ,ఉపాధ్యక్షురాలు భారతమ్మ, కోశాధికారి మహేశ్వరి ,సభ్యులు రాధా లక్ష్మి ,తిరుపతమ్మ రాజేశ్వరి ,నాంచారమ్మ, యాదమ్మ, కాంతమ్మ, పల్లవి పాల్గొన్నారు.

ఎన్ని అవరోధాలు ఎదురైనా లక్ష్యం సాధించాలి

- డీఎస్పీ శివరాం రెడ్డి

నవతెలంగాణ నల్గొండ - క్లాక్ టవర్

విద్యార్థులు కష్టపడి చదుకోవాలని, ఎన్ని అవరోధాలుఎదురైనా అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని డీఎస్పీ కె.శివరాంరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని స్థానిక బొట్టు కూడా ప్రభుత్వ పాఠశాలలో మిషన్ పరివర్తన కార్యక్రమం వన్ టౌన్ పోలీసులు,పల్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పల్రెడ్డి రాంరెడ్డి సంయుక్తంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ అనేది ఒక వ్యక్తి ,పూర్తి జీవితాన్ని నిర్దేశిస్తుందని, ఈ వయసులో కష్టపడి చదువుకొని అనుకున్న మంచి లక్ష్యాలను సాధిస్తే వారికి, వారి తల్లిదండ్రులకి ,సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రవి,వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్సై శంకర్ , పల్ రెడ్డి రాంరెడ్డి, నరసింహారెడ్డి, హెడ్మాస్టర్ శంకర్ ఉపాధ్యాయులు పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ- మిర్యాలగూడరూరల్



పట్టణంలోని ఈదులగూడకు చెందిన మన్నెం విజయలక్ష్మీ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్ రావు, తిప్పన విజయసింహ రెడ్డి మృతురాలి నివాసానికి వెళ్ళి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి వెంట మాజీ ఏఎంసీ చైర్మెన్ చిట్టిబాబు నాయక్, మన్నెం శ్రీనివాస రెడ్డి, చిర్ర మల్లయ్య యాదవ్, కృష్ణా రెడ్డి బండి, సుధాకర్ రెడ్డి, పందిరి శ్రీనివాస్, సైదా నాయక్, లింగా రెడ్డి పాల్గొన్నారు.

గణేశుని మండపాలకు అనుమతి తప్పనిసరి: ఎస్సై



నవతెలంగాణ-మునగాల

గణేశుని మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు పోలీసుల అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని మునగాల ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరెంటు కనెక్షన్ కోసం డిడి తీయాలన్నారు. మండపాలతో రోడ్డు మొత్తం బ్లాక్ చేయవద్దని సూచించారు. గణేష్ మండపాలు వాహనాలు వెళ్లే దారిలో అడ్డుగా పెట్టవద్దన్నారు. డిజేలకు అనుమతి లేదని చెప్పారు. మైక్ పర్మిషన్ తప్పనిసరిగా తీసు కోవాలిన్నారు. రాత్రి 10 గంటల తర్వాత మైక్‌లు ఆపి వేయాలన్నారు. కమిటీ ఆర్గనైజర్స్ పోలీస్ స్టేషన్ నందు సంప్రదించి కమిటీ మెంబర్స్ వివరాలు ఇచ్చి అనుమతి పొందాలన్నారు. ప్రైవేటు స్థలంలో మండపాలు పెట్టేవారు స్థల యజమాని పర్మిషన్ తప్పనిసరిగా తీసుకోవాలని గుర్తుచేశారు. గణేష్ మండపం వద్ద ఎలాంటి గొడవలు జరగకుండా కమిటీ సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. మండపం వద్ద ఎలాంటి గొడవలు జరిగినా ఆర్గనైజర్స్ కమిటీ మెంబర్స్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఎలాంటి ప్రమాదకర సంఘటనలు లేదా గొడవలు జరిగినా పోలీసులకు వెంటనే తెలియజేయాలని కోరారు.

బీమాతో ధీమా

పీఏసీఎస్ చైర్మెన్ పాలెపు చంద్రశేఖర్



నవతెలంగాణ-తిరుమలగిరి

ఎల్ఐసీ 67 వసంతాలు పూర్తి చేసుకొని 68వ వసంతంలోకి అడుగిడుతున్న ఇన్సూరెన్స్ వారోత్సవాల సందర్భంగా తిరుమలగిరి సాటిలైట్ ఆఫీస్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో తిరుమలగిరి పీఏసీఎస్ చైర్మెన్ పాలెపు చంద్రశేఖర్ ప్రత్యేక అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. బీమా చేయండి ధీమాగా ఉండండి అని పిలుపు నిచ్చారు. భారత ప్రభుత్వానికి ఆర్థికంగా ఎల్ఐసి సంస్థ వెన్నుముక గా నిలుస్తుందని,దీనికి కారణం ఎల్ఐసి ఏజెంట్లు పట్టుబట్టి పాలసీ చేపియ్యడం మరియు పాలసీదారులు పాలసీ చేయడం చేయడమేనన్నారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ అనిల్ కుమార్, డెవలప్మెంట్ ఆఫీసర్లు రాజు కుమార్, ఎలేందర్, శ్రవణ్ కుమార్ మరియు ఎల్ఐసి ఏజెంట్ యూనియన్ అధ్యక్షులు కడారి సోమయ్య, కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, కోశాధికారి బండి యాదయ్య, కె.వీరబ్రహ్మాచారి, జి.శ్రీనివాస్, ఎస్.కె. యాకూబ్ పాష,ఎల్.శ్రీనివాస్,కృష్ణమూర్తి తదితర ఏజెంట్లు పాల్గొన్నారు.

సాయుధ పోరాట వారోత్సవాలు జరిపే అర్హత బీజేపీకి లేదు





- సెప్టెంబర్ 10 నుండి 17 వరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు
- వరద బాధితులను ఆదుకోవాలి
- సీపీఐ(ఎం) జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి
- రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి

నవతెలంగాణ-సూర్యాపేట

సాయుధపోరాటంపై మత రాజకీయాలు చేస్తున్న బీజేపీకి సాయుధ పోరాట వారోత్సవాలు జరిపే నైతిక అర్హత లేదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లాలో స్థానిక ఎస్ఆర్ఎన్ గార్డెన్‌లో నిర్వహించిన సీపీఐ(ఎం) జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సెప్టెంబర్ 10 నుండి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ సాయుధం పోరాట వార్షికోత్సవ సభలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో శౌర్య యాత్ర తెలంగాణ సాయుధ పోరాట కేంద్రాల్లో నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టు లేనని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని ముస్లిం వ్యతిరేక పోరాటంగా బీజేపీ చిత్రీకరిస్తుందన్నారు. నాడు తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వారిలో ముస్లింలు ముఖ్యమైన పాత్ర పోషించారని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు జరిపే నైతిక అర్హత బీజేపీకి లేదన్నారు. నాలుగు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల వల్ల ఉమ్మడి నల్గొండ జిల్లాల్లో వరదలు సంభవించాయని దీని మూలంగా ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 18 మంది మరణించారని పేర్కొన్నారు. ఈ విపత్తులో వరద బాధితులను ఆదుకోవడానికి పార్టీ శ్రేణులు తక్షణమే కదిలి సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. వరదల కారణంగా అల్లాడిపోతున్న బాధిత ప్రజలను ఆదుకోవడానికి తక్షణమే ప్రభుత్వం అన్ని రకాల చర్యలనూ తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరణించిన కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. అంటువ్యాధులు ప్రబలే అవకాశాలున్నందున వాటి నివారణకు తాత్కాలిక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో గండ్లుపడిన, కట్టలు తెగిన చెరువులతో పాటు దెబ్బతిన్న రహదార్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. భారీ వర్షాల కారణంగా నష్టపోయిన పంటలను అంచనా వేసి నష్టపరిహారం చెల్లించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి

అంటు వ్యాధులు, విషజ్వరాల బారి నుండి ప్రజా ఆరోగ్యాన్ని రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నా వాటి నివారణకు చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ఇటీవల టైఫాయిడ్, చికెన్ గున్యా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు తీవ్రంగా వ్యాపిస్తున్నాయని అన్నారు. అయినా సీఎం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రులు మందులు, డాక్టర్ల, సిబ్బంది, కొరత తీవ్రంగా ఉందన్నారు. ప్రతి ఇంట్లో ఒకరు జ్వరంతో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిహెచ్‌సి సెంటర్‌లలో 24 గంటలు వైద్యం అందేలా చూడాలన్నారు. అన్ని గ్రామాలలోవైద్య ఆరోగ్య సిబ్బందిని పంపించి సంచారా వైద్య బృందాల ద్వారా ప్రజలందరికీ వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఖాళీగా ఉన్న డాక్టర్, స్టాఫ్ నర్స్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. డెంగ్యూ వల్ల మృతి చెందిన కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా విస్తృతస్థాయి సమావేశం సందర్భంగా పార్టీ జెండాను పార్టీ సీనియర్ నాయకులు జుట్టు కొండ వీరయ్య ఎగరవేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నగారపు పాండు అధ్యక్షతన జరిగిన ఈ విస్తృతస్థాయి సమావేశంలో జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కోలిశెట్టి యాదగిరి,పారేపల్లి శేఖర్ రావు,మేదర మెట్ల వెంకటేశ్వరరావు, మట్టిపల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మి, కోటగోపి తదితరులు పాల్గొన్నారు.



దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

- తుఫాను బాధితులందరినీ ఆదుకుంటాం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-మఠంపల్లి

భారీవర్షాల కారణంగా నష్టపోయిన ప్రతి బాధితున్ని ఆదుకుంటామని, బీఆర్ఎస్ నాయకులు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన మండలంలోని చౌటపల్లి చెరువును, ముంపుకు గురైన మండల కేంద్రంలో దళిత వాడను, రఘునాధ పాలెంలోని చర్చి ప్రాంతాన్ని, గుండ్లపల్లిలోని పాత గ్రామాన్ని సందర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారీ వర్షాలకు హుజూర్నగర్ నియోజకవర్గంలో తీవ్ర నష్టం జరిగిందన్నారు. చెరువు కట్టలు తేగిపోవడం, రహదారులు కొట్టుకుపోయాయి అన్నారు. భారీ వర్షాల విషయం తెలిసిన వెంటనే క్షేత్రస్థాయిలోనే ఉండి రెండు రోజులుగా హుజూర్నగర్, కోదాడ ప్రాంతాల్లో పర్యటన చేస్తూ పరిస్థితులను తెలుసుకుంటూ బాధితులకు కావలసిన సహాయక చర్యలను చేపడుతున్నా మ్యాన్నారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ వారు తాము బాధితులను పట్టించుకోవడంలేదని పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నారని, వారిని ప్రజలు ఓడించారని, రానున్న స్థానిక ఎన్నికల్లో పూర్తిగా మట్టికరుస్తారన్నారు. తమప్రభుత్వం ఇచ్చిన మాటకులట్టుబడి వుంటుందని, ఇల్లు కూలిపోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తామన్నారు. పశువులు కోల్పోయిన వారికి 50వేల సహాయం చేస్తామన్నారు. రైతులను ఆదకుంటామన్నారు. వారంరోజుల్లో మెయిన్ కెనాల్ గండి పూడుస్తాం. వరద నష్టాన్ని అన్ని శాఖల అధికారులతో చర్చించి కావలసిన అన్ని పనులు చేసేందుకు ప్రభుత్వం చేస్తున్నారు వీరి వెంట ఆర్డిఓ శ్రీనివాసులు, సీఐ చరమంద రాజు, తహసిల్దార్ మంగ రాథోడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య మంజీ నాయక్ ,సీనియర్ నాయకులు సామల శివారెడ్డి,ఆదూరి కిషోర్ రెడ్డి, లక్ష్మి, సింగారపు సైదులు, గుండా బ్రహ్మ రెడ్డి, బచ్చులకూరి బాబు, గంగసాని ఎల్లారెడ్డి, బుచ్చయ్య రామారావు ఉన్నారు

తోగట క్రిస్టియన్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షునిగా బాలరాజు



నవతెలంగాణ-తిరుమలగిరి

తోగట క్రిస్టియన్స్ సొసైటీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికలు రాయగిరిలోని సెయింట్ ఆగ్నేస్ హైస్కూల్లో నిర్వహించడం జరిగింది. ఎన్నికల్లో భాగంగా మొదటి అభ్యర్థిగా ఫాతిమా హైస్కూల్ చైర్మెన్ డాక్టర్ చిన్నబత్తిని బాలరాజు, రెండవ అభ్యర్థిగా పసల లూరు శౌరి పోటీ చేయడం జరిగింది. ఈ పోటీలో రెండవ అభ్యర్థి పసల లూరు? శౌరిపై మొదటి అభ్యర్థి డాక్టర్ చిన్న బత్తిని బాలరాజు భారీ మెజారిటీతో విజయం సాధించారు. అనంతరం విజయం సాధించిన బాలరాజు మీడియాతో మాట్లాడుతూ "నా కష్టం నా కులం', 'మానవత్వం నా మతం' 'వ్యక్తిత్వం నా వర్గం'అంటూ నిరంతరం సేవాభావాన్ని కలిగి ఉంటానని, సొసైటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఈ మూడు సంవత్సరాల్లో సొసైటీ కోసం నా సర్వశక్తుల కష్టపడి అఫిడవిట్‌లో పొందుపరిచిన విధంగా తన వాగ్దానాలన్నింటినీ నెరవేరుస్తానని, నూతనంగా ఎన్నికైన తొగట డాక్టర్ చిన్న బత్తిని బాలరాజుగా తొగట క్రిస్టియన్ సొసైటీ సభ్యులకు, ఎలక్షన్ కమిషన్ సభ్యులకు తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. క్రిస్టియన్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా ఫాతిమా హైస్కూల్‌లోని ప్రధానోపాధ్యాయులు ఆంటోని, రామాంజనేయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

'మురుగు నీరు లేకుండా చూడాలి'

నవతెలంగాణ-మునగాల

ఇండ్లలో మురుగు నీరు నిల్వలేకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని తాహశీల్దార్ వలిగొండ ఆంజనేయులు తెలిపారు. మంగళవారం నవతెలంగాణతో మాట్లాడుతూ.. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు గ్రామాల్లో పారిశుధ్యం లోపించే అవకాశం వుందని గుర్తుచేశారు. రోడ్లపై మురుగునీరు నిల్వ వుండటంతో దోమలు మరింతగా విస్తరిస్తాయని చెప్పారు. వానలు కురవటంతో దోమల ఉధృతి కూడాపెరుగుతుందన్నారు. దీంతో ప్రజలు వ్యాదుల భారీన పడే అవకాశం వుందని చెప్పారు. ముఖ్యంగా ప్రజలు పరిశుభ్రతను పాటించాలన్నారు. తాగు నీరు కలుషితం అయ్యో ప్రమాదం వుందన్నారు. తాగు నీటిని వేడి చేసి చల్లార్చి తాగాలన్నారు. ఇప్పటికే గ్రామాల్లో ని ప్రజలు విష జర్వాలతో బాధపడుతున్నారని చెప్పారు.గ్రామాల్లో పారిశుధ్య నివారణ కు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తహాశీల్దారు వెంట ఎఆర్ఐ నారపరాజు రామా రావు ఉన్నారు.

రుణమాఫీ కాని రైతులు కుటుంబ నిర్ధారణ చేసుకోవాలి

వ్యవసాయ సంచాలకులు ఎల్లయ్య

నవతెలంగాణ-కోదాడరూరల్

రుణమాఫీ కాని రైతులు కుటుంబ నిర్ధారణ చేసుకోవాలనీ డివిజన్ సహయ వ్యవసాయ సంచాలకులు ఎల్లయ్య తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కాపుగల్లు రైతివేదిక లో రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ కి హాజరై రుణమాఫీ కాని రైతుల కుటుంబ నిర్ధారణ పత్రాలను వ్యవసాయ అధికారులకు అధించాలని తెలియ చేస్తూ , భారీ వర్షాల కారణంగా పంట నష్ట పోయిన రైతులను గుర్తించి పంట నష్టం వివరాలను పంపల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పాలెం రజనీ, ఏ ఈ ఓ లు సల్మా, ఝాన్సి, మహేష్ పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ

నవతెలంగాణ-సూర్యాపేట

వాసవి క్లబ్ అద్యక్షులు చల్లా లక్ష్మయ్య ఆధ్వర్యంలో మంగళ వారం స్థానిక వాసవి క్లబ్ కార్యాలయం వద్ద ఆలేటి ఆటం అనాథాశ్రమంలో నిత్యావసర సరుకులు బియ్యం, పప్పు, నూనెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ గవర్నర్ రాచర్ల కమలాకర్ మాట్లాడుతూ.. వాసవి క్లబ్ వ్యవస్థాపకులు కేసి గుప్తా జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం పుట్టినరోజు నుండి వారం రోజుల పాటు సేవాకార్యక్రమాలు నిరహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా అనాథల నిమిత్తం నిత్యావసర సరుకుల పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కోశాధికారి పాలవరపు శ్రీశైలం,కార్యదర్శి సోమ ఉపేందర్, వాసవి క్లబ్ ఇంటర్ నేషనల్ సెక్రటరీ వేణుమాధవ్, ట్రెజరర్ కలకోట లక్ష్మయ్య ,జాయింట్ సెక్రటరీ బిక్కు మల్ల కృష్ణ ,జెడ్ సి బెలిధె శ్రీనివాసులు, ఆర్.సి. జూలకంటి నాగరాజు, ఐపిసిఐసి ఆర్సిలు, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కష్ట, నష్టాలను పరిశీలించేందుకే క్షేత్రస్థాయి పర్యటనలు

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



నవతెలంగాణ-హుజూర్‌నగర్ టౌన్

ప్రజల కష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపరిహారం చెల్లించేందుకే పర్యటనలు చేస్తున్నట్లు రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం హుజూర్ నగర్ మున్సిపాల్టీ పరిధిలోని 1వ వార్డులో పర్యటించి వరద ప్రభావిత నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇండ్లలోకి నీరు పోయి నష్టం జరిగిన ప్రతి ఒక్కరికి రూ.10 వేలు ప్రభుత్వం ఇస్తుందని, దద్దనాల చెరువు వరద వల్ల ధ్వంసం అయినా డ్రైనేజిని పరిశీలించి త్వరగా మరమ్మతులు చేపించాలని అధికారులకు సూచించారు. శివాలయం బజారు 7వ వార్డులో ఉన్న ట్యాంక్ బండ్ కొరకు కట్టిన డ్రైనేజి ప్లానింగ్ సరిగ్గా లేకపోవటం వల్లనే వరద నీరు ఇండ్లలోకి వచ్చాయని నేను గతంలో ఎంపిగా ఉన్నపుడే ప్లానింగ్ సరిగ్గా లేదని మార్చాలని సూచించిన మార్చకుండా అలాగే నిర్మించటంతో నేడు ప్రజలకు తీవ్ర నష్టం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి కారణమైన ఎన్ఎస్పి ఏఈ శ్రీనివాస్‌ని సస్పెండ్ చేయాలని, అలాగే చెరువు కట్టకు సాధ్యమైనంత త్వరగా మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఇరిగేషన్ సిఈ రమేష్ బాబును ఆదేశించారు. అలాగే వరదల వల్ల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో తడిచిన ఎరువుల బస్తాలను పరిశీలించారు. అనంతరం మట్టంపల్లి రోడ్డు జంక్షన్‌లో దెబ్బ తిన్న రోడ్లను పరిశీలించి ఆక్రమణలను తొలగించాలని ఆర్‌డిఓకి సూచించారు. అలాగే రోడ్లను నూతనంగా నిర్మించాలని పబ్లిక్ హెల్త్ మున్సిపల్ ఇంజనీర్‌కి సూచించారు. అంతకుముందు హుజూర్‌నగర్ మండలంలో బూరుగడ్డ నుండి గోపాలపురం వెళ్లె ప్రధాన రోడ్డులో బూరుగడ్డ చెరువు కట్ట గండిపడిన ప్రదేశాన్ని పరిశీలించి త్వరగా మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. నష్టపోయిన ప్రతి ఎకరానికి రూ.10 వేలు ప్రభుత్వం నుండి సహాయం అందిస్తామని రైతులకు మంత్రి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ శ్రీనివాసులు, తహసీల్దార్ నాగార్జున రెడ్డి, మున్సిపల్ కమిషనర్ యాకుబ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తన్నీరు మల్లికార్జున్ ,మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, కౌన్సిలర్లు, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం అందిస్తాం

- ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి రెడ్డి



నవతెలంగాణ-కోదాడరూరల్

ఇటీవల కురిసిన భారీ వర్షానికి దెబ్బతిన్న పొలాలకు కూలిన ఎండ్లకు చనిపోయిన వ్యక్తులకు ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం అందేలా చూస్తామని ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు. మంగళవారం భారీ వర్షాలతో గ్రామాలలో దెబ్బతిన్న ప్రాంతాలలో నియోజకవర్గ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి ముంపు ప్రాంతాలను పరిశీలించారు.అనంతగిరి మండలం చనుపల్లి, కిష్టాపురం, గొండ్రియాల, కోదాడ పట్టణ పరిధిలోని తమ్మర గ్రామం లోని చెరువు నీరు వెళ్లే కాలువకు పడిన గండి ప్రదేశాన్ని పరిశీలించారు. కోదాడ మండల పరిధిలోని గణపవరం గ్రామంలో ముంపు ప్రాంతాలను పరిశీలించి మాట్లాడారు. అధికారులు తక్షణమే ఆయా గ్రామాలలో ఎంత పంట నష్టం వాటిల్లిందని, ఎంతమంది ఇండ్లు కోల్పోయారు అని సర్వే చేసి రికార్డ్ చేయాలి అని అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరికి నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా వరద అనేకమంది ఇండ్లలోకి వెళ్ళట వలన కుటుంబాలు దుస్తులు తడవడంతో ఆయా గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఆయా గ్రామాలలోని బాధితుల కోసం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇవ్వగలరు అని కోరారు. వాటిని బాధితులకు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ సామినేని ప్రమీల, కనగాల జనార్ధన్ ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నరసయ్య మృతి పట్ల సంతాపం

నవతెలంగాణ-మద్దిరాల



బీసు నరసయ్య మృతి పట్ల ఆయన కుటుంబానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు సంతాపం తెలిపారు. కుక్కడం గ్రామానికి చెందిన బీసు నర్సయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముక్కాల అవిల్లమల్లు యాదవ్ మంగళవారం ఆయన మృత దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచిపాల వెంకన్న, పోలుమల్ల గ్రామ శాఖ అధ్యక్షుడు ఏలేటి శ్యామ్ రెడ్డి, మండల నాయకులు కొమ్ము అంజయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయ స్థలం వేలానికి కోర్టు ఉత్తర్వులు

నవతెలంగాణ-హుజూర్ నగర్

హుజూర్‌నగర్ తహశీల్దార్ కార్యాలయంలోని వందగజాల ఖాళీస్థలంను బహిరంగ వేళములో విక్రయించడానికి స్థానిక సీనియర్ సివిల్ జడ్జి జట్టా శ్యాంకుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని వేపల సింగారం గ్రామానికి చెందిన ముడ రాయపరెడ్డికి ఆ గ్రామ సర్వే నెంబర్ 356 లో 4 ఎకరాల 28 గంటల వ్యవసాయ భూమి ఉంది. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన చక్కెర రోషమ్మకు సర్వేనెంబర్ 357లో 28 గుంటల భూమి ఉంది. అట్టి భూమిని 1985 సంవత్సరంలో నిరుపేదలకు ఇండ్లను నిర్మించడానికి ప్రభుత్వం భూసేకరణ చేసింది. ఎకరం ఒక్కంటిని పదివేల రూపాయల ధర నిర్ణయించగా దానికి వ్యతిరేకిస్తూ రైతులు భూసేకరణ ట్రిబ్యునల్ కం మిర్యాలగూడ కోర్టును ఆశ్రయించారు. పూర్వపరాలు పరిశీలించిన న్యాయస్థానం ఎకరం ఒక్కంటికి 17వేల 500 రూపాయల ధరను నిర్ణయిస్తూ నష్టపరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చింది. సంవత్సర కాలానికి 9శాతం వడ్డీ మిగతా కాలానికి 15శాతం వడ్డీ రైతులను ఇబ్బందికి గురి చేసినందుకు 30 శాతం నష్టపరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ హుజూర్ నగర్ మండల భూసేకరణ రెవెన్యూ అధికారి రాష్ట్ర హైకోర్టులో ఆపిల్ దాఖలు చేశారు పూర్వపరాలు పరిశీలించిన హైకోర్టు అప్పీల్‌ను కొట్టివేసింది. రైతులు డబ్బును రాబట్టుకొనుట కొరకు మిర్యాలగూడ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో 2014లో రైతులు పిటిషన్ దాఖలు చేశారు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇటీవల హుజూర్‌నగర్ కుమంజూరైనందున కేసును హుజూర్నగర్ కోర్టుకు బదిలీ చేశారు. ఇక్కడ న్యాయస్థానం తహసిల్దార్ కార్యాలయం దాని ఖాళీ స్థలం బహిరంగ వేయడంలో విక్రయించడానికి అటాచ్మెంట్ ఆర్డర్ జారీ చేయగా కోర్టు నుండి వెళ్ళిన కోర్టు బెలీఫ్ కార్యాలయం విలువను ఐదు కోట్లుగా నిర్ధారించారు బాధితులకు ఇంతకుముందు చెల్లించిన నష్టపరిహారం పోను నాలుగు కోట్ల 46 లక్షల 448 రూపాయలు రావాల్సి ఉంది. అందువల్ల తహసిల్దార్ కార్యాలయంలో 100 గజాల స్థలాన్ని విక్రయించడానికి రైతుల విన్నపం మేరకు కోర్టు నిర్ణయించింది. బెలీఫ్ నివేదిక అందిన తదుపరి తాసిల్దార్ కార్యాలయం స్థలం బహిరంగబలం కు సంబంధించి తదిపరి ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

కావడిపై ఆస్పత్రికి తరలింపు



నవతెలంగాణ-తుంగతుర్తి

మండల పరిధిలోని కేశవాపురం వద్ద ఉన్న బంధం వాగు ఇటీవల కురిసిన వర్షాలకు ఉధృతంగా ప్రవహించడంతో కేశవపురం వెలుగుపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలోనే కేశవాపురం గ్రామానికి చెందిన పడిశాల కుటుంబరావుకు మంగళవారం ఉదయం తేలు కుట్టింది. అతనికి చికిత్స నిమిత్తం దవాఖానాకు తీసుకెళ్లడానికి రవాణా సౌకర్యం లేక అతనిని కర్ర కావడికి జోలకట్టి అతన్ని నీటి గుండా గ్రామస్తులు దాటివేసి అతన్ని తుంగతుర్తిలోని ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో బంధం వాగు ఉప్పొంగితే అత్యవసర నిమిత్తం ఊరు దాటి బయటికి వెళ్లలేని పరిస్థితి ఉందని తెలిపారు. తాము ఎన్నోసార్లు బంధం వాగుపై బ్రిడ్జి నిర్మించాలని ప్రజా ప్రతినిధులకు వేడుకున్న సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు.

గుండెపోటుతో మహిళ బస్సులో మృతి



నవతెలంగాణ-అర్వపల్లి

గుండెపోటుతో మహిళ బస్సులో మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబీకులు ఎస్సై బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం నాగారం మండల పరిధిలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన జటంగి యాదమ్మ(55) జ్వరంతో బాధపడుతూ చికిత్స కోసం సూర్యాపేటకు జనగాం-సూర్యాపేట బస్సులో బయలుదేరింది. అర్వపల్లికి సమీపంలో రాకముందే అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో బస్సులో మృతి చెందింది. బస్సులోని వారు ఆమెను చూడగానే మృతి చెందిందని గుర్తించారు. కండక్టర్ వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాడు. ఎస్సై బాలకృష్ణ కుటుంబీకులతో మాట్లాడి మృతదేహాన్ని బస్సులో నుండి ఆటోలోకి తరలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తికి తరలించారు.

'సాగర్ సిమెంట్' సహకారంతో బియ్యం పంపిణీ

- పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



నవతెలంగాణ-మఠంపల్లి

మండల కేంద్రంలోని దళితవాడలో ఇటీవల కురిసిన భారీవర్షాలకు ఇండ్లు నీటమునిగిన బాధితులకు మంగళవారం సాగర్ సిమెంట్ వారి సహకారంతో కుటుంబానికి 25 కేజీల బియ్యం చొప్పున మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలాధితులను ఆదుకునేందుకు ముందుకొచ్చినందుకు అభినందించారు. వరదల్లో కాలనీ ప్రాంతానికి కాంగ్రెస్ నాయకులు వెళ్లి పరిస్థితిని పరిశీలించి మంత్రి దృష్టికి తెచ్చారు. సాగర్ సిమెంట్స్ వారు సుమారు 150 కుటుంబాలకు బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తాసిల్దార్ మంగరాథోడ్, పరిశ్రమ అధికారులు హరిదాస్, తూడి వెంకటరెడ్డి మంజీ నాయక్ ఆదోరి కిషోర్ రెడ్డి, బుచ్చయ్య, బచ్చలకూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

విపత్తుపై అధికారుల పర్యవేక్షణ కరువు



నవతెలంగాణ-కోదాడరూరల్

మండల పరిధిలోని కూచిపూడి గ్రామంలో వరదల విపత్తు జరిగి రోజులు గడుస్తున్నా నేటికీ అధికారుల పర్యవేక్షణ కరువైందని మాజీ సర్పంచ్ శెట్టి సురేష్ నాయుడు అన్నారు. మంగళవారం గ్రామంలో ఇటీవల వచ్చిన వరదలకు నష్టపోయి రోజు వారీ కూలీ పనులు చేసుకుని జీవనం సాగించే సుమారు 200 కుటుంబాలకు భోజన సదుపాయం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామం పెద్ద ఎత్తున ఆర్థికంగా నష్టపోయి దిక్కుతోచని స్థితిలో బిక్కు బిక్కుమంటూ కొట్టుమిట్టాడుతున్నప్పటికీ నేటికీ అధికారులు స్పందించకపోవడం ఎలాంటి పర్యవేక్షణ చేయకపోవడం బాధాకరమని రోజు వారీ కూలీ పనులు చేసుకుని జీవితాన్ని వెళ్ళదీసే సుమారు 200 కుటుంబాలు తినడానికి తిండి లేక కట్టుకోవడానికి బట్టలు లేక ఆకలితో అలమటిస్తున్నారని వారికీ అండగా నిలవాల్సిన అవసరం ఉందని రైతులు కూడా వందల ఎకరాల్లో పంట నీట మునిగి దిక్కు తోచని స్థితిలో ఉన్నారని ప్రభుత్వం, దాతలు దతృత్వంతో స్పందించి వారికి సహాయ సహకారాలు అందిచాలని ప్రార్థిస్తున్నానన్నారు. సకాలంలో విద్యుత్ సరఫరా అందించినా నీటి సమస్యలు తొలగుతాయని విద్యుత్ అధికారులు వెంటనే స్పందించాలని పనులను పూర్తి చేయాలనీ అన్నారు ఈ కార్యక్రమంలో శెట్టి చంద్రయ్య, శెట్టి రమేష్,శెట్టి నర్సింహా రావు, శెట్టి వెంకట్, గోపి, భానునాయుడు, శాంసన్, మట్టయ్య, యోహాన్, రాజశేఖర్, నాగేంద్ర బాబు, ఎల్లేష్, వంశీ, ఖరీం, ఖాసీం, సైదా, షావలి పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన కొలనుపాక, పటేల్‌గూడెం గ్రామాల మధ్య వంతెన

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మండలంలోని కొలనుపాక, పటేల్‌గూడెం గ్రామాలను కలిపే ముత్యాలమ్మ గుడి వద్ద మట్టి రోడ్డును గతేడాది రైతులందరూ విరాళాలు వేసుకొని మరీ పైపులైన్ మట్టితో వంతెన నిర్మించుకోగా , ఇటీవల మూడు రోజులు కురిసిన వర్షాలకు, వంతెన తో పాటు, పైపులు కొట్టుకుపోయాయి. ఈ దారి గుండా దాదాపు 300 మంది రైతు కుటుంబాలకు చెందినవారు నిత్యం తిరుగుతుంటారు. రోడ్డు కొట్టుకు పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నిధులు కేటాయిస్తూ కొత్త వంతెన నిర్మించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



బత్తుల సిద్దేశ్వరున్ని పరామర్శించిన చెరుపల్లి సీతారాములు

నవతెలంగాణ-ఆలేరుటౌన్

రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టి, బీసీలకున్యాయం చేయాలని 10 రోజులుగా హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో ఆమరణ నిరాహార దీక్షచేస్తున్న బీసీ నాయకుడు బత్తుల సిద్దేశ్వరున్ని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చేరుపల్లి సీతారాములు, ఆలేరు మాజీ శాసన సభ్యులు బూడిద భిక్షమయ్యగౌడ్ మంగళ వారం ఆస్పత్రి వద్ద పరామర్శి ంచారు. ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దేశ్వర్ దీక్షకు మద్దతు తెలుపుతూ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం బీసీల కులగనణ చేపట్టాలని డిమాండ్ చేశారు.



పంట రుణమాఫీ అమలుచేయడంలో ప్రభుత్వం విఫలం

- **సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్**

నవతెలంగాణ-చౌటుప్పల్

రైతులకు పంట రుణమాఫీ అమలుచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ అన్నారు.మంగళవారం చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో ఆ పార్టీ మండల జనరల్‌బాడీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.ఎన్నికలకు ముందు ఏకకాలంలో రుణమాఫీ హామీని నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గ్రామాల్లో సర్వేల పేరుతో ప్రభుత్వ యంత్రాంగం కాలయాపన చేస్తుందన్నారు. గ్రామాల్లో రైతులందరూ ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ట్రిబుల్‌ఆర్ బాధితులకు మార్కెట్ విలువ ప్రకారంగా ధర



చెల్లించి, న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. ఈ నెలలో గ్రామ, మండల, జిల్లా నిర్మాణ మహాసభలకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. పార్టీ నిర్మాణం జరిగితే ప్రజా ఉద్యమాలకు ఊతమిస్తాయన్నారు. పార్టీ మహాసభల పేరుతో ప్రజల్లోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయాలని సూచించారు. బలమైన ఉద్యమాలు నిర్వహించేందుకు మహాసభలు ఎంతో ఉపయోగపడ్తాయని తెలిపారు.ఈ సమావేశంలో ఆ పార్టీ మండలకార్యదర్శి గంగదేవి సైదులు, జిల్లా కమిటీ సభ్యులు బూర్గు కృష్ణారెడ్డి, గడ్డం వెంకటేశం, మండలకార్యదర్శివర్గ సభ్యులు రాగీరు కిష్టయ్య, తడక మోహన్, చీరిక సంజీవరెడ్డి, పల్లె మధుకృష్ణ, కొండె శ్రీశైలం, చింతల సుదర్శన్, బోయ యాదయ్య, పొట్ట శ్రీను, బోదాసు వెంకటేశం, అంతటి అశోక్, జక్కిడి రమణారెడ్డి, చీరిక అలివేలు, ఎలమోని సంజీవ, కాశం వెంకటేశం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వరద సహాయ కార్యక్రమాల్లో పాల్గొనండి

- **బాధిత కుటుంబాలను ఆదుకోవాలి**
- **సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్**

నవతెలంగాణ-భువనగిరి

నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన అత్యంత భారీ వర్షాల వల్ల వరదలు సంభవించాయని, మూసి పొంగి పొర్లుతు ందన్నారు.వర్షం వరదల కారణంగా నష్ట పోయిన బాధిత కుటుంబాలను ఆదు కోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ పార్టీ సభ్యులకు, ప్రజలకు మంగళవారం విజ్ఞప్తి చేశారు. జిల్లాలో పంట నష్టం, ఆస్తి నష్టం, రోడ్లు దెబ్బతిన్నా యన్నారు.ఈ విపత్తులో వరద బాధితులను ఆదుకోవడానికి పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, కార్య కర్తలు తక్షణమే కదిలి సహాయ కార్యక్రమాలలో పాల్గొనాలని కోరారు. చెరువులు, వాగులు, కట్టలు తెగడంతో లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయని తెలిపారు. రహ దారులపైకి నీరు రావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిందని పేర్కొన్నారు. వరదల కారణంగా అల్లాడిపోతున్న బాధిత ప్రజలను ఆదుకోవడానికి తక్షణమే ప్రభుత్వం అన్ని రకాల చర్యలనూ తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలను, పంట నష్ట పోయిన రైతుల కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు న్నందున వాటి నివారణకు జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో తాత్కాలిక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువులతోపాటు దెబ్బతిన్న రహదార్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ఇండ్లు, భవనాలను గుర్తించి వాటిని మున్సిపాలిటీ లేక గ్రామపంచాయతీలు తొలగించాలని కోరారు. భారీ వర్షాల కారణంగా నష్టపోయిన పంట లను అంచనా వేసి నష్టపరిహారం అందిం చేందుకు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీజనల్‌వ్యాధుల పట్ల ప్రజలుఅప్రమత్తంగా ఉండాలి

- **కలెక్టర్ హనుమంతు కె.జెండగే**

నవతెలంగాణ-చౌటుప్పల్

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే తెలిపారు. మంగళవారం చౌటుప్పల్ మున్సిపల్‌పరిధిలోని తంగడపల్లిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన తనిఖీచేశారు.ఈ సందర్భంగా ఓపీ వివరాలు, మందులస్టాక్, పంపిణీ వివరాలను పరిశీలి ంచారు.సీజనల్ వ్యాధుల పట్ల తీసుకుంటున్న చర్యలు ఆరోగ్య కేంద్రం డాక్టర్ కాటంరాజును అడిగి తెలుసుకున్నారు. ఇంటింటి జ్వర సర్వే పక్కాగా చేయాలని, అవసరమైన చోట మెడికల్ క్యాంపులు పెట్టాలని సూచించారు. ఫీవర్ సర్వేలో గుర్తించిన వారిని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రక్త పరీక్ష చేసి దాని ప్రకారం వైద్యం అందించాలని, అవసరమైన మందులతో సిద్ధంగా ఉండాలని సూచించారు. దోమల నివారణకు కృషిచేయాలని, నీటి నిల్వ గుంతలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఆయిల్ బాల్స్ వినియోగించాలని, సీజనల్ వ్యాధుల నిర్మూలనకు అవసరమైన అన్ని పారిశుధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్, మండల ప్రత్యేక అధికారి కె.ప్రమోద్‌కుమార్‌కు సూచించారు.



సూరేపల్లి-శివారెడ్డిగూడెం వద్ద మూసీనదిపై బిడ్జి నిర్మించాలని వినతి

నవతెలంగాణ-భువనగిరికలెక్టరేట్

భువనగిరి మండలం సూరెపల్లి - పోచంపల్లి మండలం శివారెడ్డిగూడెం, ఇంద్రియాల శివారులో మూసీనదిపై నూతనంగా హైలేవల్ బిడ్జి నిర్మాణం చేపట్టి రెండు మండలాల్లోని ప్రజలకు రవాణా సౌకర్యాలు కల్పించాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఎమ్మెల్యేను హైదరా బాదులోని ఆయన నివాసంలో భువనగిరి మండలంలోని సూరెపల్లి, ఆకుతోటబావితండా, కాండ్లకుంటతండా, పచ్చర్లబోడుతండా గ్రామ ప్రజలు, రైతులు కలిసి , మాట్లాడారు.భూదాన్‌పోచంపల్లి మండలాల్లోని ఇంద్రియాల చుట్టుపక్కల గ్రామాల్లో భువనగిరి మండలంలోని పచ్చర్లబోడుతండా, సూరెపల్లి గ్రామానికి చెందిన గిరిజన రైతుల భూములు ఉన్నందున ఆ గ్రామానికి వెళ్లాలంటే బీబీనగర్ మండలంలోని బట్టుగూడెం, పెద్దరావులపల్లి మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి ఉంటుందన్నారు.సూరేపల్లి, బొల్లెపల్లి, ఆకుతోటబావితండా, కాండ్లకుంటతండా, పచ్చర్లబోడుతండా ప్రజలు నిత్యం భూదాన్‌పోచంపల్లి, హయత్‌నగర్, పెద్దఅంబర్‌పేట్, ఎల్‌బీనగర్ ప్రాంతాల్లో విద్యార్థులు చదువుల కోసం ప్రయాణం చేయాలంటే ఇక్కడి నుంచి 25 కిలోమీటర్లు మాత్రమే ఉండగా చుట్టు ఇటు బీబీనగర్, బట్టుగూడెం అటు చౌటుప్పల్ మీదుగా 60 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి ఉంటుందన్నారు.ఇక్కడి గిరిజన ప్రజలను దృష్టిలో పెట్టుకొని వెంటనే మూసీనదిపై నూతనబిడ్జిని నిర్మాణం చేపట్టాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఇరిగేషన్ డీఈతో ఫోన్‌లో మాట్లాడి బిడ్జి కోసం ఎస్టిమేషన్ వివరాలతో సమర్పించాలని కోరారు.బిడ్జి నిర్మాణం కోసం, గ్రామ అభివృద్ధికి తోడ్పడుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు తెలిపారు.వినతిపత్రం అందజేసిన వారిలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు చెవ్వల నరేష్, బానోతు నర్సింహ, కెతావత్ ఉమ్లానాయక్, ఉపసర్పంచ్ గుగులోతు తిరుపతి, కాంగ్రెస్ మండల మహిళాఅధ్యక్షురాలు పిట్టల రజిత, గ్రామస్థులు, మద్ది వెంకటనర్సిహ్మారెడ్డి, గుగులోతు లచ్చిరాం నాయక్, గుగులోతు నర్సింహ్మ నాయక్, లక్ష్మారెడ్డి, పుల్లారెడ్డి, అనంతరెడ్డి, చెవ్వల హరికృష్ణ, చముదాల రామకృష్ణ , మద్ది యుగంధర్‌రెడ్డి, గులాం రసూల్, సూర్యప్రకాష్,మధుగాని మైసయ్య, మధుగానివెంకటేష్, ఆడెపు మహేందర్, బానోత్ శంకర్, జీడిమట్ల కొండల్‌రెడ్డి ఉన్నారు.



శ్రీ రామకృష్ణ విద్యాలయంలో వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మండలకేంద్రంలో మంగళవారం శ్రీ రామకృష్ణ విద్యాలయంలో జనని స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఏకశీల హై స్కూల్, శ్రీ రామకృష్ణ విద్యాలయం, ఎవరెస్టు హై స్కూల్, జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ నుండి 100 మంది విద్యార్థులు పాల్గొని తమ తమ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా శ్రీ రామకృష్ణ విద్యాలయం కరెస్పాండెంట్ బండిరాజుల శంకర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటిబాలలే రేపటి పౌరులన్నారు.సమ సమాజస్థాపన కోసం సైనికులుగా తయారుకావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జనని స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ కుంతావత్ కమలాకర్, చైర్మెన్ మైదం భాస్కర్,సంస్థ సభ్యులు జూకంటి సంపత్, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు దూడల వెంకటేష్, ఇక్కిరి సిద్దేశ్వర్, సందీప్, తరిగొప్పుల రమేష్ పాల్గొన్నారు.



వినాయకుని నిమజ్జనం దాకా బాధ్యతాయుతంగా ఉండాలి

నవతెలంగాణ-రాజపేట

వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నిలబెట్టే సమయం నుండి నిమజ్జనం అయ్యేవరకు అధికారులు ఉత్సవ కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా ఉండాలని తహసిల్దార్ దామోదర్, ఎంపీడీవో నాగవేణిలు కోరారు.మంగళవారం రాజాపేట మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీసు పంచాయతీ సెక్రెటరీలు, ప్రత్యేక అధికారులు, విద్యుత్, వైద్య, రెవెన్యూ, అంగన్వాడీ, నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తగు సూచనలు సలహాలు స్వీకరించి తెలియజేశారు.మంటప నిర్మానం స్థలం యజమాని అనుమతి తీసుకోవాలని, వినాయకుని సైజు మరియు నిమజ్జనం తేదీని అదేవిధంగా నిమజ్జనం చేసే ప్రాంతాన్ని వాహనం, డ్రైవర్ వివరాలను తప్పకుండా తెలియ జేయాలన్నారు.తొమ్మిది రోజుల లోగా లేదా 11 రోజులలో గా తప్పకుండా నిమజ్జనం చేయాలని డీజే లకు ఎలాంటి అనుమతులు లేవని పోలీసు కేసులను ఎదుర్కో వద్దని సూచించారు.ఈ సమా వేశంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ యాదగిరి, ఆర్‌ఐలు సలీం, రమేష్, అంగన్వాడీ సూపర్వైజర్ రమణకుమారి, విద్యుత్ ఏఈ చంద్రశేఖర్, వైద్యశాఖ నుండి ఉపేందర్, ఏబీఎస్ నర్సింహ, శ్రీ రామకృష్ణ సాయి మందిరం నవరాత్రి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ఉప్పల రమేష్ పాల్గొన్నారు.



6న సదస్సును జయప్రదం చేయండి

- **మూసీ ప్రక్షాళన - గోదావరి కృష్ణ జలాల సాధన వేదిక జిల్లా కో- కన్వీనర్ కొండమడుగు నర్సింహ**

నవతెలంగాణ-భువనగిరికలెక్టరేట్

గోదావరి-కృష్ణా జలాల సాధన కోసం, మూసీ ప్రక్షాళనకై ఈనెల 6 వ తేదీన వలిగొండ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సదస్సు 'ను జయప్రదం చేయాలని మూసీ ప్రక్షాళన - గోదావరి, కృష్ణ జలాల సాధన వేదిక జిల్లా కో- కన్వీనర్ కొండమడుగు నర్సింహ పిలుపునిచ్చారు. మంగళవారం భువనగిరి మండలపరిధిలోని అనాజిపురం గ్రామంలో మూసీ ప్రక్షాళన - గోదావరి కృష్ణ జలాల సాధన వేదిక ఆధ్వర్యంలో సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ 40 ఏండ్ల పోరాట ఫలితంగా మూసీ ప్రధాన కాలువకు అనుసంధానంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో బునాదిగాని కాలువ, భీమలింగం కాలువ, ఆసిఫ్ నగర్ కాలువ, ధర్మారెడ్డిపల్లి కాలువ, పిల్లాయిపల్లి కాలువలు ఏర్పడ్డాయన్నారు. కానీ నేటికీ ఏండ్లు గడుస్తున్నా కాలువల నిర్మాణం, నిర్వహణ మాత్రం నేటికీ పూర్తిస్థాయిలో పూర్తికాక అస్తవ్యస్తంగా ఉన్నాయని ఆవేదన వెలిబుచ్చారు.పాలకులు కాలువల నిర్వాణ విషయంలో పూర్తి చేసే విషయంలో విఫలమయ్యారని విమర్శించారు. మరో పక్క మూసీ నీరు నేడు అనేకమంది పరిశ్రమ పెట్టుబడిదారులు తమ పరిశ్రమల నుండి వెలువడే రసాయనాలను వదలడం వల్ల ఆ నీరును కలుషితమై కాలకూట విషయంగా మారాయని ఆవేదన వెలిబుచ్చారు.ఆ నీరుతో పండిన పంటలు తింటే అనేక జబ్బులు వస్తాయని శాస్త్రవేత్తలే చెప్తున్నారని నర్సింహ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వేదిక జిల్లా నాయకులు దయ్యాల నర్సింహ, మాజీ సర్పంచ్ బొల్లేపల్లికుమార్, పాలసంఘం మాజీచైర్మెన్ ఎదునూరి మల్లేశం, నీటి సంఘం మాజీ చైర్మెన్ గునుగుంట్ల శ్రీనివాస్, వేదిక మండల నాయకులు, రైతులు అబ్దుల్లాపురం వెంకటేష్, ఎండి. జహంగీర్, కడారి కృష్ణ, పాల సంఘం డైరెక్టర్స్ తోటకూర మల్లేశం, గంగనబోయిన పాండు, గంగనబోయిన బాలనర్సింహ, బొల్లెపల్లి ప్రవీణ్, నానపురం నాగయ్య, పిట్టల కృష్ణ,నానపురం అశోక్,తెల్జీరి రాములు, లక్ష్మయ్య, మానపాటి ఎల్లయ్య పాల్గొన్నారు.



భువనగిరిలో..

వలిగొండ : ఈనెల 6న మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మూసీ ప్రక్షాళన-బునాదిగాని,భీమలింగం కాల్వల ద్వారా గోదావరి-కృష్ణా జలాల సాధన కోసం జరిగే సదస్సును జయప్రదం చేయాలని జిల్లా కన్వీనర్ మాటూరు బాలరాజు-కోకన్వీనర్ సిర్పంగి స్వామి లు పిలుపునిచ్చారు.మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వాకిటి వెంకటరెడ్డి, దొడ్డి భిక్షపతి, వరికుప్పల యాదయ్య, వడ్డమాని వెంకటయ్య,మారబోయిన నర్సింహ, బొడ్డు రాములు,వేముల దావీదు, వేముల నాగరాజు,గ్రామ రైతులు పాల్గొన్నారు

జైహింద్ జూనియర్ కళాశాలకు గుర్తింపు లేదు

నవతెలంగాణ-భువనగిరిఅర్బన్

స్థానిక పట్టణ శివారులోని హన్మాపురం దగ్గర జైహింద్ జూనియర్ కళాశాలను నోడల్ అధికారి రమణి తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కళాశాలకు ప్రభుత్వం అనుమతులు లేకుండా, గుర్తింపు పొందకుండా కళాశాల నిర్వహిస్తూ అడ్మిషన్లు తీసుకున్నదన్నారు.తనిఖీ చేసి రికార్డులు పరిశీలించగా మొదటి సంవత్సరంలో 45 మంది విద్యార్థులు రెండవ సంవత్సరంలో 15 మంది విద్యార్థుల అడ్మిషన్లు పొంది ఉన్నారని తెలిపారు. డిఫెన్స్ అకాడమీ పేరుతో జూనియర్ కళాశాలను ప్రారంభించి అనుమతులు తీసుకోకుండా విద్యార్థులను మోసం చేస్తున్నారన్నారు.ఈ కళాశాలకు అనుమతులు లేనందున ఎవరు అడ్మిషన్ తీసుకోవద్దన్నారు.ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఈ కళాశాలపై ఇంటర్‌బోర్డుకు రిపోర్టుచేశామన్నారు. జిల్లాలో గుర్తింపులేకుండా జూనియర్‌కళాశాలలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బసంతాపురం అంగన్వాడీకేంద్రంలో పోషణ్ మహా కార్యక్రమం

నవతెలంగాణ-రాజపేట

పోషన్ మహాలో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం సూపర్వైజర్ రమణ అధ్యక్షతన బసంతాపురం అంగన్వాడీ కేంద్రంలో రీడ్ -ఎ -తోన్ అనే కార్యక్రమం తల్లులతో నిర్వహించారు.ప్లేస్కూల్ పిల్లలకు కథను చెప్పే విధానాన్ని వివరించారు. కథలపై ఆసక్తి కలిగించేలా హావభావాలతో వాయిస్ మాడ్యులేషన్‌తో చదివి చెప్పాలన్నారు.ఈ సమావేశంలో అంగన్వాడీ టీచర్ మంజుల, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-రాజపేట

రాజపేట మండలంలోని పారుపల్లి గ్రామంలో మోత్కుపల్లి ఎల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.వారి కుటుంబానికి కాంగ్రెస్ తరఫున మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ రాపోలు లక్ష్మారెడ్డి 50 కిలోల బియ్యం అందజేశారు.అదేవిధంగా కాంగ్రెస్ ఎస్సీసీఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు భూపతి యాదగిరి ఆరోగ్యం గురించి తెలుసుకొని పరామర్శించారు.వారికి లక్ష్మారెడ్డి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు మోటేబాల మల్లేశం, సీతాలవీరయ్య,కాలే నర్సింహులు,మాజీ ఎంపీటీసీ రావుల బాలరాజు, గౌర బక్కయ్య, కడారు బాలయ్య, బొమ్మగాని నర్సింహులు, కడారు భాస్కర్, విజయ్, గడ్డం కపిల్,రాసమల్ల భాస్కర్, మోటే నర్సింహులు, జూకంటి రాములు, ఆర్‌ఎంపీ డాక్టర్ ఆంజనేయులు, యాకయ్య పాల్గొన్నారు.

టోల్‌గేట్ల వద్ద ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా చూడాలి

- **రాచకొండ కమిషనరేట్ సీపీ సుధీర్‌బాబు**

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో టోల్‌గేట్ల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు.మంగళవారం ఆయన కమిషనరేట్ పరిధిలోని చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్, మల్కాపురం చెరువు, పంతంగి టోల్ గేట్లను సీపీ సుధీర్‌బాబు ఐపిఎస్ సందర్శించారు.ప్రజలు, వాహన దారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, తీసుకోవలసిన నష్టనివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులకు వివరించారు. టోల్ గేట్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు పలు సూచనలు ఇచ్చారు.సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించడానికి చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించడంతో పాటు రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ వంటి పలు విభాగాల పనితీరు, సీసీటీవీల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాల సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.



క్షణం క్షణం ...భయం భయం...!

- **రక్షణ లేని కల్వర్టుపై రాకపోకలు**
- **అటు ఇటు అయితే అంతే సంగతి**

నవతెలంగాణ-బొమ్మలరామారం

బొమ్మలరామారం మండలకేంద్రం నుండి చీకటిమామిడి వెళ్ళే మార్గంలో ఖాజీపేట వాగుపై గల పురాతన కల్వర్టును దాటాలంటే వాహనదారులు, ప్రయాణికులకు గుండెల్లో రైలు పరిగెడుతున్నాయి.ఆ కల్వర్టుకు ఇరువైపులా రక్షణగోడ లేక పోవడంతో వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు ఏమాత్రం అటు ఇటు అయినా బిడ్జి కింద నుండి ఉధృతంగా ప్రవహించే వాగులో పడిపోవడమేనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి కావడంతో రక్షణ గోడ లేని బ్రిడ్జి మీద నుండి వెళుతుంటే కింద ప్రవహిస్తున్న నీళ్లను చూస్తూనే భయమేస్తుందని, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేస్తున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.ఈ కల్వర్టుకు రెండు పక్కలా రక్షణ గోడ నిర్మాణం చేపట్టాలని, ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రయాణికులు వాహనదారులు కోరుతున్నారు.



రేషన్ కార్డులేని కుటుంబ నిర్ధారణను పరిశీలించిన ఏడీఏ

నవతెలంగాణ-తుర్కపల్లి

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం తుర్కపల్లి రైతువేదిక లో మంగళవారం తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షల రుణమాఫీ లో భాగంగా రేషన్ కార్డులు కలిగి ఉన్న రైతులు రుణమాఫీ కాగా రేషన్ కార్డు లేని రైతులకు రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం రైతు కుటుంబాలను నిర్ధారించడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమం లో పాల్గొన్న యాదగిరిగుట్ట ఏడీఏ(ఆర్) శాంతినిర్మల పాల్గొని పరిశీలించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ కుటుంబసభ్యుల నిర్ధారణ చేసుకోని రైతులు వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యుల నిర్ధారణను పూర్తి చేసుకోవాన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఉమా, ఏఈఓ లు పృథ్వీరాజ్, ఉమారాణి, దివ్య, జెస్సి, తిరుమల్‌రావు, రాకేష్, రైతులు పాల్గొన్నారు.



గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆలేరులో తెలుగు, ఇంగ్లీష్,ఫిజిక్స్ సబ్జెక్టులకు 2024-25 విద్యా సంవత్సరానికిగాను గెస్ట్‌లెక్చరర్లుగా పనిచేయడానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రాజారాంనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.విద్యార్హత సంబంధిత సబ్జెక్టులో 55శాతం ఉత్తీర్ణతతో పీజీ,ఎస్సీ,ఎస్టీలకు 50శాతం ఉత్తీర్ణత ఉండాలని ,నెట్,సెట్ కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని చెప్పారు.ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను సెప్టెంబర్ 5వ తేది 4.30 గంటల లోపు కళాశాలలో సమర్పించాలన్నారు.

16వ వార్డులో మున్సిపల్ చైర్మెన్ పర్యటన

నవతెలంగాణ-భువనగిరి

మన వార్డు-మన చైర్మెన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అర్బన్ కాలనీ 16 వార్డులో మున్సిపల్ చైర్మెన్ వెంకటేశ్వర్లు పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో ఉన్న చిన్నచిన్న పెండింగ్ వర్కులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మౌలిక సదుపాయాల కోసం స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ కడారి ఉమాదేవి వినోద్ ,ఎండి. తాజుద్దీన్, ఎండి.అఫీజ్, వస్తువుల సాయికిరణ్, మేడి జగదీష్ పాల్గొన్నారు.



డ్రయినేజీ నిర్మించారు..రోడ్డు మరమ్మతులు మార్చారు

- **ఐదు నెలలవుతున్నా పట్టించుకోని అధికారులు**
- **ఇబ్బందులు పడుతున్న ప్రజలు**

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

మండలంలోని పొర్లగడ్డతండాలో అండర్ గ్రౌండ్ పైప్ లైన్ నిర్మాణం కోసం రోడ్డు తవ్వి ఐదు నెలలు అవుతున్నా రోడ్డు మరమ్మతు పనులు చేపట్టడం లేదని ఆ తండా గిరిజనులు ఆరోపిస్తున్నారు.మురుగునీరు పారుదల కోసం రోడ్డును తవ్వినా అధికారులు తిరిగి రోడ్డు నిర్మాణం చేపడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ రోడ్డుపై వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.తవ్విన రోడ్డుపై గుంతలు పడి మరుగు నీరు చేరి ఈగల దోమలకు స్థావరాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డెంగ్యు ,కలరా,మలేరియా తోపాటు అంటూ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వెంటనే సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని రోడ్డు మరమ్మత పనులు చేపట్టాలని కోరుతున్నారు.



బాగున్నా రోడ్డు పాడు చేశారు:ఆంబోతు రాజేందర్



మురికి కాలువ నిర్మాణం పేరుతో మంచిగున్న రోడ్డును పాడుచేసి పట్టించుకోవడం లేదు.రోడ్డుమీద వెళ్తూ వాహనదారులు కింద పడుతున్నారు.తండ మీదగా వెళ్తున్న వారు మమ్మల్ని తిట్టి వెళ్తున్నారు. రోడ్డు ధ్వంసం చేసిన కాంట్రాక్టర్ తిరిగి మళ్ళీ చూడడం లేదు. వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

అధికారులు పట్టించుకోవడం లేదు: ముడావత్ రాజు

రోడ్డు తవ్వి ఐదు నెలలవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.ఈ రోడ్డుపై వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నిసార్లు చెప్పినా కాంట్రాక్టర్లు,అధికారులు వినిపించుకోవడం లేదు. మాఇబ్బందులు అర్థం కావడం లేదు.వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలి.



అంటు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది ఆమ్గోత్ కిషన్

వర్షం నీరంతా రోడ్డుపైనే చేరి గుంతల మయమైంది.బురద నీటిగుంతలు ఈగలు, దోమలకు స్థావరాలయ్యాయి. అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఏర్పడింది. వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలి.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
బుధవారం | సెప్టెంబర్ 04, 2024 | www.navatelangana.com

కుక్కలు అడ్డు రావడంతో.. రోడ్డు ప్రమాదం



నవతెలంగాణ-తిరుమలగిరి

తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని వెంగపాలెం మోరి దగ్గర తిరుమలగిరి నుండి రామారం బైక్‌పై వెళ్తున్న దుంబాల లక్ష్మారెడ్డి (65) ఒక్కసారిగా కుక్కలు అడ్డు రావడంతో బైకు అదుపు తప్పి క్రింద పడడంతో తలకు బలమైన గాయం అయి స్పృహ తప్పిపోయాడు. ఇంతలో వాహన దారులు గమనించి 108 సమాచారం అందించారు. 30 నిముషాలకు 108 వాహనం ఆలస్యంగా వచ్చింది. వెంటనే జనగామ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. తిరుమలగిరికి 108 వాహనం ఏర్పాటు చేయాలనీ కోరారు.

యానాల శాంతమ్మ చిత్రపటానికి నివాళులు

నవతెలంగాణ -నకిరకల్



నకిరేకల్ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు యానాల మోహన్ రెడ్డి సతీమణి యానాల శాంతమ్మ దశదిన కర్మ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి యాతాకుల అంజయ్య, నకిరేకల్ కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు కొండ జానయ్య గౌడ్, వేరువేరుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

జిల్లాను కుదిపేసిన వర్షాలు, వరదలు



- జిల్లాలో తెగిన15 చెరువు కట్టలు, 6 కాలువలు
- 20 వేల ఎకరాల్లో పంటల నష్టం
- పూర్తిగా కూలిన ఏడు గృహాలు, పాక్షికంగా దెబ్బతిన్న 44 ఇండ్లు
- 11 చోట్ల తెగిన రోడ్లు
- ఇద్దరు వ్యక్తులు, ఏడు పశువుల మృతి
- భారీ నష్టం, పునరుద్ధరణకు సవాళ్లు







నవ తెలంగాణ-సూర్యాపేట

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో ఇటీవలే కురిసిన భారీ వర్షాలు, వరదల ధాటికి జిల్లా భారీగా నష్టపోయింది. అనూహ్యంగా కురిసిన వర్షాలతో చెరువులు, నదులు పొంగిపొర్లేలా చేశాయి. ఇండ్లలోకి నీరు చొచ్చుకురావడం, పంటలు నీట మునగడం, రహదారులు తెగిపోవడం వంటి పరిస్థితులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదేవిధంగా వర్షాల దెబ్బకు, వరదలు ఉధృతం కావడంతో పలు వాహనాలు కొట్టుకుపోయి, రోడ్లు తెగిపోవడంతో జిల్లా అతలాకుతలం అయింది. ప్రధానంగా గతంలో ఎన్నడూ లేని విధంగా రోడ్లపై నిలిచిన కార్లు, ఆటోలు, బైకులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. జిల్లాలో వర్షం ధాటికి ఏర్పడిన దృశ్యాలు హృదయ విదారకంగా మారాయి. వర్షాల తీవ్రత కారణంగా కాలువలు, చెరువులు పొంగిపొర్లి, కోదాడ, హుజూర్ నగర్‌తో పాటు కొన్ని గ్రామాలు వరదల్లో చిక్కుకున్నాయి. ఈ క్రమంలోనే వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. వరదల కారణంగా ఇద్దరు మృతి చెందగా.. ఏడు పశువులు మృతి చెందాయి. అధికారులు సమర్పించిన నివేదికల ఆధారంగా జిల్లాలో..



పంటల నష్టం..

జిల్లా ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి ఉంది. వరి, పత్తి, కంది,పెసర తదితర పంటలు అధికంగా సాగుచేస్తారు. వరదల కారణంగా వందల ఎకరాల్లో పంట పొలాలు పూర్తిగా నీటమునిగాయి. రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారు. పంటల నష్టం అంచనా ప్రకారం లక్షలాది రూపాయల వరకూ ఉండవచ్చు. ముఖ్యంగా, పంటల నష్టంతో పాటు నేలలో తేమ తగ్గడం, భూమి ఉబుకిపోవడం వంటి సమస్యలతో భవిష్యత్తులో పంట సాగు కష్టంగా మారే అవకాశం ఉంది.రైతులకు ఈ వర్షాలు, వరదలు పెద్ద సమస్యగా మారాయి.వేలాది ఎకరాల వ్యవసాయ భూములు నీట మునగడంతో పంటలు నాశనమయ్యాయి. వరి, పత్తి, పంటలు పూర్తిగా నీటమునిగి రైతులు తీవ్ర ఆర్థిక నష్టాన్ని చవిచూశారు. పంటల నష్టం, భవిష్యత్తులో భూమి పునరుద్ధరణ కష్టమై రైతులు ఆందోళనలో ఉన్నారు.ఈ క్రమంలో పరిశీలిస్తే జిల్లాలో మొత్తం 14,120 ఎకరాల్లో వరి పంట నష్టం జరిగింది. అదేవిధంగా 5,576 ఎకరాల్లో పత్తి పంట నష్టం వాటిల్లిందని జిల్లా అధికారులు నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమర్పించారు. నష్టపోయిన రైతులకు పదివేలు చొప్పున సియం నష్ట పరిహారం ప్రకటించిన విషయం తెల్సిందే.

నీటిపారుదల ఆయకట్టు పరిధిలో తీవ్ర నష్టం..

జిల్లాలో మొత్తం 15 చెర్వు కట్టలు, ఆరు కాల్వలు తెగడంతో అస్తవ్యస్తంగా మారింది. హుజుర్ నగర్ డివిజన్ పరిధిలో 8 చెర్వు కట్టలు,కోదాడ డివిజన్ లో నాలుగు,సూర్యాపేట డివిజన్ పరిధిలో మూడు చెర్వు కట్టలు తెగాయి. ప్రస్తుతం వీటి మరమ్మతులకు అంచనా వేస్తున్నారు.

దెబ్బతిన్న గృహాలు..

జిల్లాలో మొత్తంగా ఏడు ఇండ్లు నేలమట్టం అవగా.. 44 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వీటిలో కోదాడ డివిజన్ లో ఆరు ఇండ్లు కూలిపోగా 21 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఇక హుజుర్ నగర్ లో ఒక్క ఇల్లు కూలగా ఇంకో ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నది.సూర్యాపేట డివిజన్ పరిధిలో 22 ఇండ్లు మాత్రం పాక్షికంగా దెబ్బతిన్నాయి.

దెబ్బతిన్న రహదారులు..

వర్షాల ధాటికి రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా ప్రయాణిస్తున్న రోడ్లు తెగిపోవడంతో ప్రమాదంలో చిక్కుకున్నారు. ప్రధాన రహదారులు, జాతీయ రహదారులు కూడా నీట మునిగి, రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. దీంతో, అత్యవసర సేవలు ఆలస్యం కావడంతో పలు సమస్యలు ఎదురయ్యాయి.వీటిలో జిల్లా వ్యాప్తంగా 11 చోట్ల రోడ్లు తెగిపోగా...16 ప్రాంతాల్లో రహదారుల పై నీరు ప్రవహించడంతో రోడ్లు దెబ్బ తిన్నాయి.వీటి తాత్కాలిక మరమ్మతులు కోసం 92.50 లక్షల అంచనా వేయగా శాశ్వత మరమ్మతులు కోసం 2280.00 లక్షలుగా అధికారులు అంచనా వేశారు.

ప్రాణ నష్టం..

వర్షాలు, వరదల కారణంగా కొందరు ప్రజలు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. వరదలో కొట్టుకుపోయి మరణించిన సంఘటనలు, ప్రమాదాలకు గురైనవారిని రక్షించేందుకు సహాయక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. రహదారులపై కొట్టుకుపోయిన వాహనాలలో పలువురు ప్రాణాలను కోల్పోయారు.ఈ క్రమంలో కోదాడ లో ఇద్దరు మృతి చెందారు. అలాగే సూర్యాపేట డివిజన్‌లో ఆరు పశువులు, హుజూర్ నగర్ డివిజన్‌లో ఒకటి పశువు మృతి చెందాయి. జిల్లాలో మొత్తం ఏడు పశువులు మృతి చెందాయి.

మౌలిక సదుపాయాలు..

రహదారులు, వంతెనలు, పంచాయతీ భవనాలు, స్కూల్‌లు, ఆసుపత్రులు వంటి మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. కొన్ని గ్రామాలు తాత్కాలికంగా ఇతర ప్రాంతాలతో రాకపోకలు నిలిచిపోయాయి. రహదారులు తెగిపోవడంతో, ప్రజల రాకపోకలు ,తక్షణ సహాయ కార్యక్రమాలు ఆలస్యమయ్యాయి. అనేక ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది, ఫోన్ కనెక్షన్లు దెబ్బతిన్నాయి.

ఇండ్లలోకి చేరిన నీరు..

పలు ప్రాంతాల్లో ఇండ్లతో పాటు ప్రభుత్వ ఆఫీస్‌లు, చిన్న నివాసాలలో వరద నీరు చేరడంతో సామానులు, విలువైన పత్రాలు, విద్యార్థుల పుస్తకాలు పాడయ్యాయి. వీటితో పాటు గేదెలు, మేకలు, కూరగాయల తోటలు కూడా తీవ్రంగా నష్టపోయాయి. పేదలు తమ ఆస్తులు కోల్పోవడం వలన వారికి కొత్తగా బతుకు మొదలుపెట్టడం సవాలుగా మారింది. వరదల అనంతరం ప్రజల ఆరోగ్యం ప్రధాన సమస్యగా మారింది. నిలిచిన నీరు, వ్యాధుల వ్యాప్తి వలన డెంగీ, మలేరియా, జలుబు, జ్వరం వంటి వ్యాధులు విస్తరించనున్నాయి. పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య లోపం వలన మరింత సమస్యలు ఏర్పడ్డాయి. జిల్లా వైద్య అధికారులు ప్రత్యేక ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి, ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారు.

ప్రభుత్వం చర్యలు..

సూర్యాపేట జిల్లా వరద ప్రభావాన్ని అంచనా వేసి, ప్రభుత్వం తక్షణ సహాయ చర్యలు చేపట్టింది. వర్షాల కారణంగా చనిపోయిన వారి కుటుంబాలకు 5 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియాను ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అలాగే పశువులు చనిపోతే యజమానికి 50 వేల రూపాయలు ఇవ్వాలని నిర్ణయించామని, మేకలు, గొర్రెలు చనిపోతే 5,000 రూపాయలను ఆ యజమానులకు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. పంట నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరాకు 10,000 చొప్పున ఇవ్వాలని నిర్ణయించామని, ఇండ్లు కూలిన వారికి ప్రధానమంత్రి ఆవాస్



యోజన పథకం కింద పూర్తి నష్ట పరిహారం ఇస్తామని, అలాగే అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు సైతం నిర్మించి ఇస్తామని తెలిపారు. భారీ వర్షాలు, వరదలలో తక్షణ సహాయక చర్యలకు గాను జిల్లా కలెక్టర్‌కు 5 కోట్ల రూపాయలు ముందే మంజూరు చేసి సిద్ధంగా ఉంచడం జరిగిందని, జిల్లా కలెక్టర్ నిర్ణయం మేరకు ఆ నిధులను సహాయక చర్యలకు వినియోగించవచ్చని తెలిపారు.

రైతు కుటుంబ సభ్యుల ధ్రువీకరణ

నవతెలంగాణ-నేరేడుచర్ల

నేరేడుచర్ల వ్యవసాయ అధికారి కార్యాలయంలో జరుగుతున్న రెండు లక్షల రూపాయల రుణమాఫీ కానీ రైతులకు కుటుంబ దృవీకరణ కార్యక్రమంలో హుజూర్నగర్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడిఏ) రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయం జరుగుతున్న రైతు కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్కే జావేద్, ఏఈవోలు అన్వేష్ నాగరాజు, నిర్మల, స్నేహలత మరియు రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-మిర్యాలగూడ

సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి ,మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు మంగళవారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో పంపిణీ చేశారు. మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలోని పలు మండలాలకు చెందిన (72) మంది లబ్దిదారులకు రూ. 18 లక్షలా 96 వేలా 500 విలువగల చెక్కుల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, మాజీ జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షులు చింతరెడ్డి శ్రీనివాస రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ చిట్టిబాబు నాయక్, మాజీ మార్కెట్ వైస్‌చైర్మెన్ వీరకోటిరెడ్డి పాల్గొన్నారు.

వరద బాధిత కుటుంబాల కోసం ఒకరోజు వేతనం

నవతెలంగాణ-మిర్యాలగూడ

రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ,ఉపాధ్యయ సంఘాలు ఒకరోజు వేతనం విరాళంగా ఇచ్చి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని సీఎం సహాయనిధికి అందజేశాయని బంజారా ఉద్యోగుల తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్ అన్నారు. మంగళవారం స్థానికంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత వారం రోజుల నుండి కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తం కావడంతో పాటు అనేక మంది మృత్యువాత పడడం కలచివేసిందన్నారు.అకస్మాత్తుగా వచ్చిన వరదలు రాష్ట్రంలోని అనేక జిల్లాలలో ఆస్తి, ప్రాణ నష్టాలకు గురిచేసిందన్నారు.దీంతో ప్రస్తుత నెల వేతనం నుండి విరాళం నిధులు మినహాయించబడతాయని చెప్పారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గంగారం తండాకు చెందిన నునవత్ మోతిరాం,అశ్విని లు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పొరుషోత్తమయగూడెం బ్రిడ్జి వద్ద వరదలో కొట్టుకపోవడం బంజారా ఉద్యోగుల సంఘంను కలచివేసిందన్నారు. ఈ సమావేశంలో బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు గోపీ, మక్ల,శ్రీను, హరి, రమేష్, లాలు, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

'గణేష్ విగ్రహాల ప్రతిష్ఠకు అనుమతి తప్పని సరి'

నవతెలంగాణ -పెద్దవూర

గ్రామాల్లో గణేశుని విగ్రహాలు ప్రతిష్ఠించే వారు తప్పనిసరిగా మండల పోలీస్ వారి అనుమతి తీసుకోవాలని ఎస్ఐ వీరబాబు తెలిపారు. మంగళవారం మండలం కేంద్రం లో విలేకరుల సమావేశం లో మాట్లాడారు.మండపాలలోకరెంటు కనెక్షన్ కోసం డీడీ తీయాలని తెలిపారు.మండపాలతో రోడ్డు మొత్తం బ్లాక్ చేయవద్దని, గణేష్ మండపాలు వాహనాలు వెళ్లే దారిలో అడ్డుగా పెట్టవద్దని అన్నారు.డీజే లకు ఎలాంటి లకు అనుమతి లేదని కేవలం మైక్ పర్మిషన్ తప్పనిసరిగా ఉండాలన్నారు.రాత్రి 10 గంట తర్వాత మైక్లు ఆపివేయాలని కోరారు. కమిటీ ఆర్గనైజర్స్ పోలీస్ స్టేషన్ నందు సంప్రదించి కమిటీ మెంబర్స్ వివరాలు ఇచ్చి పర్మిషన్‌తీసుకోవలెనని అన్నారు. ప్రైవేటు స్థలంలోమండపాలు పెట్టేవారు స్థల యజమాని పర్మిషన్ తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. .ఎలాంటి ప్రమాదకర సంఘటనలు లేదా గొడవలు జరిగిన వెంటనే పోలీసువారి8712670198, 8712670153 ఫోన్ నంబర్ల కుతెలపాలని కోరారు.

ఆర్అండ్ఆర్ ప్యాకేజీ త్వరగా ఇచ్చి ఇండ్ల నిర్మాణాలు చేపడతాం



- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

నవతెలంగాణ-దేరవకొండ

నక్కలగండి ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న నక్కలగండితండా, కేశ్యతండా గ్రామాల నిర్వాసితులకు త్వరలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి చెల్లించి ఇళ్ల నిర్మాణానికి అనుకూలమైన స్థలాన్ని ఎంపిక చేసి ఇండ్ల నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. మంగళవారం చందంపేట మండల పరిధిలోని నక్కలగండి ప్రాజెక్టు ముంపుకు గురవుతున్న నక్కలగండితండా, కేశ్యతండా గ్రామాలు గత రెండు రోజులుగా ప్రవహిస్తున్న డిండి వాగు వల్ల నష్టపోయిన పంటలను, ఇండ్లను సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకొని నిర్వాసితుల కుటుంబాలను పూర్తిస్థాయిలో ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఇక్కడే నివాసం ఉంటూ భూములు సాగు చేస్తూ ప్రస్తుతం ముంపు ద్వారా నష్టం వాటిల్లిన పంటలను వివరాలను వ్యవసాయ అధికారుల ద్వారా పరిశీలన చేయించి నష్ట పరిహారం అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు బధ్యానాయక్, మాజి ఎంపీపీలు పార్వతి చందునాయక్, గోవింద్, ముత్యాల సర్వయ్య, జడ్ పిటిసి బుజ్జి లచ్చిరామ్ నాయక్, యువజన కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, పిఎసిఎస్ చైర్మన్ శ్రీశైలం యాదవ్, డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్ రావు, మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు భరత్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్ విద్యార్థుల గోడు పట్టించుకునే నాథుడు ఎవరు ?

- సీఎం దగ్గర ఉన్నా సంక్షేమ శాఖకు నిధులు కరువు
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు నరేశ్, శంకర్

నవతెలంగాణ-దేవరకొండ

సంక్షేమ హాస్టల్ విద్యార్థుల గోడు పట్టించుకోకపోవడం వల్ల హాస్టల్ చెత్త కుప్పగా మారాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ విమర్శించారు. ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన మోటార్ సైకిల్ పోరు యాత్ర మంగళవారం దేవరకొండకు చేరింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గాడిదప్పిన సంక్షేమ రంగంలో ఉండే హాస్టల్ విద్యార్థుల బతుకులు అగమ్య గోచరంగా మారాయన్నారు. 70 ఏళ్ల స్వతంత్ర భారతంలో హాస్టల్లో ఉండే విద్యార్థులు ఆరు బయట స్నానాలు చేస్తున్నారన్నారు. నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ ,బీసీ సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు కనీసం మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు. సంక్షేమ శాఖ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్నప్పటికీ ఆ శాఖకు నిధులు కరువయ్యాయన్నారు. హాస్టల్లో హెచ్ డబ్ల్యూఓ లు అందుబాటులో లేరని, రూములలో ఫ్యాన్స్ సౌకర్యాలు తాగడానికి మంచినీరు కూడా అందుబాటులో లేవని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు పెరుగుతున్న ధరలకనుగుణంగా మెస్ ,కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. 5 ,6 నెలల మెస్ చార్జీల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దేవరకొండ మండలం కోండ భీమన పల్లి లో బిసి గురుకుల బాలుర పాఠశాల లో గురువులు లేరన్నారు. గత నాలుగు నెలలుగా సబ్జెక్టు సంబంధించిన ఉపాధ్యాయులు



లేకపోవడంతో విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారు.విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదన్నారు. త్రాగడానికి మంచినీరు సరఫరా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు . దేవరకొండ ఆదర్శ పాఠశాల, కళాశాల హాస్టల్ విధ్యార్థినీలు హాస్టల్లో ఏమైనా చిన్న చిన్న మైనర్ రిపేర్లు వస్తే విద్యార్థినులు డబ్బులు పోగేసి చేయించుకుంటున్నారని ఆరోపించారు. ఆదర్శ పాఠశాల ఆవరణలో కోళ్ళఫారమ్ వుండడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల లో కుర్చోని శ్రద్ధగా పాఠాలు వినే పరిస్థితిలో లేమని యాత్ర బృందం దృష్టి తీసుకొచ్చినట్లు తెలిపారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు స్పందించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ యాత్రలో రమావత్ లక్ష్మణ్ నాయక్ ,బుడిగ వేంకటేష్ ,రాష్ట్ర గర్ల్స్ కో కన్వీనర్ కుంచం కావ్య, జిల్లా ఆపిస్ బేరర్స్ కుర్ర సైదా నాయక్, కొరె రమేష్, ముస్కురవిందర్, స్పందన, పావని, జగన్ నాయక్, సంపత్ , రాకేష్,వీరన్న ,నవదీప్, కిరణ్, న్యూమాన్, ప్రవిణ్, ఇద్దిరాములు, సాయి, సిద్దు, నవీన్,వర్షిత్,చందు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 6 వరకు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడలోని ఎన్ఎస్పి క్యాంప్ డీఎస్ ఏ ఇండోర్ స్టేడియంలో ఈ నెల4 నుంచి6వరకు రాష్ట్రస్థాయి అండర్ 11 బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు టోర్నీ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రశాంత్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తోట రంగారావు తెలిపారు. మిర్యాలగూడలోని డిఎస్ఏ ఇండోర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టోర్నమెంట్‌లో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 200కు పైగా బాలబాలికలు పాల్గొన్నట్లు తెలిపారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సౌజన్యంతో మిర్యాలగూడ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు మూడు రోజులపాటు ఉచిత భోజన, వసతి ఏర్పాట్లు కల్పించినట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్ మొత్తానికి ఎంబీఏ సభ్యులు, దాతలు, ప్రముఖులు సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీలకు చీఫ్ రెఫరీగా ఎండి సోహెల్, మ్యాచ్ కంట్రోలర్ గా చంద్రశేఖర్ తో పాటు రాష్ట్రస్థాయిలో ఎంపైర్లుగా నియమించబడిన వారు పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చేతులమీదుగా పోటీలు ప్రారంభమవుతాయని... గ్రామీణ ప్రాంతాల్లో సైతం మెరుగైన క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా మిర్యాలగూడలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజింగ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ అంజయ్య, జాయింట్ సెక్రెటరీ నవీన్ కుమార్, జిల్లా కోచ్ మారబోయిన రామకృష్ణ, ఎంబీఏ సభ్యులు వనమాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి



నవతెలంగాణ-నకిరేకల్

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ కోరారు మంగళవారం నకిరేకల్ పట్టణంలోని వడ్డెర బస్తీ, ఎస్సీ కాలనీ, మొండి వారి కాలనీలో పర్యటించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి సమస్యలు పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద నీరు విపరీతంగా వస్తున్న నేపథ్యంలో దోమలు ప్రబలకుండా సానిటేషన్ చేయాలని అధికారులకు సూచించారు. గుబురుగా ఉన్న చెట్ల వల్ల విషపురుగులు ఇళ్లలోకి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని కరెంటు స్తంభాలను ముట్టుకోవద్దన్నారు. అత్యవసర సమయాల్లో నన్ను గాని, కార్యకర్తలను, మున్సిపల్ అధికారులను సంప్రదించాలన్నారు.

ముల్ల అమయమ్మ మృతికి సంతాపం

నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డుకు చెందిన ముల్ల అమయమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ వేరువేరుగా మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, చరిత్రకారుడు డాక్టర్ సూర్య కుమార్, వైద్యులు ఆర్ వీరబ్రహ్మం, రవీందర్ రెడ్డి, రామ్మోహన్ రావు, నారాయణ, వెంకన్న తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారం తోనే ఆరోగ్యం

నవతెలంగాణ - శాలిగౌరారం

గర్భిణులు పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ కె.వేణుగోపాల్ రెడ్డి అన్నారు.మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గర్భిణులు ప్రతి నెల ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ పౌష్టికాహారం తీసుకున్నప్పుడే పుట్టబోయే బిడ్డ ఆరోగ్య వంతంగా పుడతారన్నారు. ఎంపీడీఓ గార్లపాటి జ్యోతి లక్ష్మి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాపిస్తుందున ప్రతి ఒక్కరూ పరిసరాల,వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యాంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి సూర్య శిల్ప,పిహెచ్ఎన్ రాములమ్మ, సూపర్ వైజర్ మరియా,చార్టర్ ప్రసిడెంట్ బి.శ్రీనివాసులు, క్లబ్ అధ్యక్షులు డెంకల సత్యనారాయణ, పౌష్టికాహార దాత చామల మహేందర్ రెడ్డి -అరుణ,క్లబ్ సభ్యులు దునక వెంకన్న,గుండ్ల రామ్మూర్తి,



మురారిశెట్టి కరుణాకర్,వావిలాల రామలింగయ్య శర్మ, మద్ది వెంకటరెడ్డి, గండూరి విజయ లక్ష్మి ఎఎన్ఎం లు,ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ప్రస్తుతం సీజనల్ వ్యాధుల వ్యాపిస్తున్న తరుణం లో డాక్టర్లు ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ కె.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, కస్తూరి బాయి గురుకుల బాలికల పాఠశాల ను ఆయనఆకస్మిక తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో రికార్డులను పరిశీలించారు.టార్గెట్లను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కేజీబీవీలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు.

8వ రోజుకు చేరిన మెడికల్ కళాశాల సిబ్బంది సమ్మె



నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్

పెండింగ్లో ఉన్న వేతనాలు ఇప్పించాలని కోరుతూ నల్లగొండ మెడికల్ కళాశాల శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్ సిబ్బంది మెడికల్ కళాశాల ఎదుట చేస్తున్న సమ్మె మంగళవారానికి 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా సాయి సెక్యూరిటీ సర్వీస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నల్గొండ మెడికల్ కళాశాలలో శానిటేషన్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. గత 2019 నుండి ఎనాడు జీతాలు, పిఎఫ్‌లు సక్రమంగా చెల్లించలేదని ఆరోపించారు. కేవలం రూ. 5000 జీతం చెల్లిస్తున్నారని తెలిపారు.2024 మార్చి 20వ తేదీన ఎ1 ఏజెన్సీ కి అప్పటి కలెక్టర్ హరిచందన తాత్కాలికంగా అలట్ చేయడంతో మార్చి నెల జీతం రూ. 11500 వేశారని తెలిపారు. ఆ తర్వాత ఏప్రిల్ నెల నుండి నేటి వరకు ఏజెన్సీ వారు జీతాలు చెల్లించకుండా వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కలెక్టర్ నారాయణ రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లిన ఏజెన్సీ నిర్వాహకులు మంత్రి, కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన చెందతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని పెండింగ్ వేతనాలను ఇప్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ధర్నాలో రాజు, అండాలు, మంగమ్మ, విజయ, లక్ష్మి, చంద్రమ్మ, కరుణ, స్వర్ణ, రజిత, శిల్ప పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నవతెలంగాణ-తుంగతుర్తి

మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరి, పత్తి పంటలు నీట మునిగాయని, గ్రామాల మధ్య రాకపోకలు నిలిచాయని ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తాటికొండ సీతయ్య అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రావులపల్లి మానాపురం గ్రామాల మధ్య యాదరాజుల చెరువు ఉప్పొంగి వరద రోడ్డు పై నుండి వెళ్లడంతో రోడ్డు పూర్తిగా తెగిపోవడం వలన రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, కేశవాపురం వెలుగుపల్లి మధ్యగల బంధం వాగు ఉప్పొంగడం వలన ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. పలు గ్రామాలలో ఇండ్లు కూలిపోయాయని పత్తి వరి నీట మునిగాయని వెంటనే ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్ ,కేతిరెడ్డి గోపాల్ రెడ్డి ,తునికి సాయిలు, దశరథ, సుధాకర్, ప్రసాద్, మనోజ్, వెంకన్న పాల్గొన్నారు.

గూండాలతో దాడి చేయించడం దారుణం

నవతెలంగాణ-తిరుమలగిరి



ఖమ్మంలో వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంచుతుండగా మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీష్ రెడ్డి, పువ్వాడ అజయ్, సబితా ఇంద్రారెడ్డి వాహనాలపై కాంగ్రెస్ గూండాలతో దాడి చేయించడం దారుణమని తుంగతుర్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వరద బాధితులను సాయం చేయడం చేతకాదు, సేవ చేసే వారిపై కాంగ్రెస్ కిరాయి గుండాలను పెట్టి దాడి చెయ్యించడం అత్యంత సిగ్గుమాలిన చర్య అన్నారు. కాంగ్రెస్ గూండాలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఇలాంటి సంఘటనలు పునరావృతం చేస్తున్నారన్నారు. ఖమ్మంలో రాళ్ళ దాడి చేసిన కాంగ్రెస్ గుండాలు, వారి వెనుక ఉన్నవారు ఎంతటివారైనా సరే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.

'ఉదయి'స్తున్న సముద్రం..

- బ్రాహ్మణవెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టుపై చిగురిస్తున్న ఆశలు
- 18 ఏండ్లుగా ఆగుతూ... సాగుతూ
- ఇంకా పూర్తికాని కుడి, ఎడమ కాల్వల భూసేకరణ
- 78 గంటల ట్రయల్ రన్‌తో అధికారులకు పెరిగిన ధీమా

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



బ్రాహ్మణవెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టు మొత్తం 03.09.2022 నాటికి రూ.450.56 కోట్ల పనులు(72 శాతం) పూర్తి చేయగా మిగిలిన పనులుపూర్తిచేసేందుకుగాను ప్రభుత్వం నుండి ఈఓటీ అనుమతులు పొందారు.రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల భూసేకరణ కొనసాగుతుందని ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిర్మించడానికి రూ. 240 కోట్ల ఇంకా కావాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. బ్రాహ్మణ వెల్లంల ఉదయ సముద్రం ప్రాజెక్టు విలువ ప్రకారం అంచనా 678.35 కోట్లు గాను పనులు పూర్తి చేయటానికి,భూసేకరణకి దాదాపుగా 240 కోట్లు అవుతాయనీ,సవరించిన అంచనా విలువ ప్రకారం 678.35కోట్లు పనులు పూర్తి చేయటానికి భూసేకరణకు దాదాపుగా 240 కోట్లు అవసరమైతాయని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రాజెక్టు నిర్మాణ జాప్యం ఇలా...

ఉదయసముద్రం ప్రాజెక్టు పనులు 2008 లో ప్రారంభించపడి, తొలుత అన్ని విభాగములో పనులు త్వరిత గతినజరిగినప్పటికీ, అక్టోబర్ 2013 అనుకోని వరదల వల్ల సొరంగం, సర్జికల్ పూల్ పంపు హౌజ్ మునిగిపోవడం వల్ల తదుపరి పనులు నెమ్మదిగా జరిగాయి. వాల్టా చట్టం2007 సేకరణ ఆంక్షలు విధించడం, భూసేకరణ చట్టం 2013 కారణంగా పనులు చేయటంలో జాప్యం జరిగింది. ప్రస్తుతం సొరంగం, పంపు హౌజ్, డెలివరీమిషన్ సబ్ స్టేషన్ పనులు బ్రహ్మణ వెల్లంల బ్యాలెన్స్ రిజర్వాయర్ పనులు పూర్తయ్యి సొరంగం లైనింగ్ పనులు పూర్తయ్యాయి.

78 గంటలు ట్రయల్ రన్ తో అధికారులకు పెరిగిన ధీమా

గతేడాది 72 గంటలు గత నెలలో 6: గంటలు రెండు మోటార్ల ద్వారా ట్రయల్ రన్ నిర్వహించి నీటి విడుదలను పరిశీలించారు. నీటి విడుదల విజయవంతం కావడంతో ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నీటి నింపవచ్చని ధీమా పెరిగింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఏ ఎంఆర్ఎస్ఎల్బీసీ ప్రాజెక్టుకుడికాలువకు అనుసంధానంగా ఉన్న బ్రాహ్మణ వెల్లంలఉదయ సముద్రం ప్రాజెక్టు ఈ ఏడాది మే 3న ప్రాజెక్టుకునీటి విడుదల చేసేందుకు తొలుత అధికారులు ట్రయల్స్ నిర్వహించారు. అధికారికంగా అప్పటి నకిరికల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రాజెక్టులో అధికారికంగా నీటినివిడుదల చేశారు. ఉదయ సముద్రం ప్రాజెక్టుకు గత ఏడాది 72 ఈ ఏడాదిఆగస్టులో 6గంటలు అధికారులు. ట్రయల్ రన్ నిర్వహించి 30శాతం నీటితో పంప్ హౌస్ నింపారు. బ్రాహ్మణ వెల్లంల ఉదయ సముద్రం ప్రాజెక్టు కృష్ణానది పరివాహక ప్రాంతంతో అనుసంధానం చేయబడి పానగల్ రిజర్వాయర్ నుంచి సొరంగం ద్వారా చౌడంపల్లి సంపు వరకు నీటిని అందించి అక్కడి నుంచి సర్జ్ పూల్ లోఎత్తిపోసే విధంగా ప్రణాళిక రూపొందించారు. ఈ ఏడాది విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ఉదయ సముద్రంలోకి భారీగా నీరు చేరితే ఈ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నీరు నింపే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలి

- వ్యకాస జిల్లా ప్రధానకార్యదర్శి నారి ఐలయ్య

నవతెలంగాణ-క్లాక్‌టవర్



హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించి విషజ్వరాల నుండి ప్రజలను కాపాడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారి ఐలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా వైద్యాధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం కోసం సంచార వైద్య బృందాలను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో డెంగ్యూ , టైఫాయిడ్ , మలేరియా పరీక్షలు నిర్వహించి మందుల సరఫరా చేసి.ప్లేట్ లెట్ మిషన్లు ఏర్పాటు చేయాలని కోరారు . జిల్లా వ్యాప్తంగా వర్షాకాలంలో విష జ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ప్రభుత్వం వెంటనే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని అలాగే ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వ హాస్పిటల్స్ లో మందులు డాక్టర్లు సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని ఈ సీజన్లో ప్రతి ఇంట్లో ఒకరిద్దరు జ్వరంతో బాధపడుతున్నారని విష జ్వరాల అంటువ్యాధుల నుండి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డెంగ్యూ, టైఫాయిడ్, చికెన్ గున్యా, మలేరియా పరీక్షలు చేసేవిధంగా సౌకర్యాలు కల్పించాలని వారు గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు బొజ్జ చిన్న వెంకులు, రాష్ట్ర కమిటీ సభ్యులు దండంపల్లి సరోజా, కత్తుల లింగస్వామి, జిల్లా నాయకులు మన్నె బిక్షం, చింతపల్లి లూర్దు మారయ్య, ,గండమల్ల రాములు ,గోలి నరసింహ ,కట్ట అంజయ్య ,శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నప్రసాద వితరణ

నవతెలంగాణ-నకిరేకల్



వాసవి వారోత్సవాలలో భాగంగా కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని తాటికల్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహి ంచారు. ఈ కార్యక్ర మంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ రీజియన్ చైర్మన్ దేవరశెట్టి సత్యనారాయణ, వాసవి కపుల్స్ క్లబ్ అధ్యక్షులు గుండా నరేందర్, కార్యదర్శి వీరవెల్లీ రఘునాథ్, సభ్యులు మీలా సత్యనారాయణ, శ్రీకాకోళ్ల వెంకన్న పాల్గొన్నారు.

11 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-చండూరు

11 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడిన సంఘటన మండలంలోని గుండ్రపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రేషన్ బియ్యాన్ని 22 సంచు లలో నిల్వ ఉన్న బియ్యాన్ని సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే పట్టు కొని బియ్యాన్ని సీజ్ చేసి కేస నమోదు చేసినట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.

విషజ్వరాలనుండి ప్రజలను కాపాడాలి

నవతెలంగాణ-నిడమానూరు

మండలంలోని అన్నిగ్రామాల్లోనూ ప్రజలు విష జ్వరాల బారిన పడి కీళ్ల నొప్పులతో అల్లాడి పోతున్నారని వెంటనే అధికారులు అప్రమత్తమై విషజ్వరాలనుండి ప్రజలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండేటి శ్రీను , మండల కార్యదర్శి కందుకూరి కోటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ వరుసగా వర్షాలు వీటికి తోడ సీజనల్ వ్యాధులు తొడవ్వడంతో జ్వరాలు విజృం భించి ప్రజలు అల్లాడుతున్నారని ప్రతి ఇంటికి ఇద్దరు ముగ్గురు చొప్పున విష జ్వరాల బారిన బడి బాధపడుతున్నారన్నారు. గ్రామాలలో పారిశుద్ధ్య అద్వానంగా తయారవడం వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ప్రత్యేకాధికారుల పాలనలో పారిశుధ్య అస్తవ్యస్తంగా తయారైందన్నారు. అన్ని గ్రామాల్లోనూ మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కోమండ్ల గురవయ్య, వింజమూరు శివ, తోటపల్లి బాల నారాయణ,ముత్యాల కేశవులు,వింజమూరు పుల్లయ్య పాల్గొన్నారు.

రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ-అడవిదేవులపల్లి

మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో మిర్యాలగూడ ఏడీఏ అధికారి దేవ సింగ్ పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. స్టాఫ్ రిజిస్టర్, ఈ పాస్ మిషన్,బిల్లు బుక్స్, ఇతర రికార్డ్స్ తప్పని సరిగా మైంటైన్ చేయాలని డీలర్లకు తెలపారు.ఎరువు బస్తాలు ఎమ్మార్పీ ధరలకు మాత్రమే అమ్మాలని అధిక ధరలు అమ్మితే షాప్ లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం రైతులతో కలిసి పత్తి పంటను పరిశీలించారు.ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి గుర్రం. సరిత, ఏ ఈ ఓ లు నరేష్, మహేష్, మరియు రైతులు పాల్గున్నారు.

బూరుగుపల్లిలో తాగునీటి కోసం ధర్నా

నవతెలంగాణ-రాజపేట



రెండు నెలలుగా కలిసితనీరు సరఫరా మూడు రోజులుగా తాగునీటి సరఫరా లేకుండా తమను అనేక ఇబ్బందులు పెడుతూ అడిగితే ఆగ్రహిస్తూ కష్టాలపాలు చేస్తున్నారంటూ రాజపేట మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన ప్రజలు తమ ఆక్రోసాన్ని వెళ్ళగక్కారు. మంగళవారం అసహనానికి లోనైనా మహిళలు ఆగ్రహిస్తూ గ్రామపంచాయతీ కార్యదర్శి సిబ్బంది తీరుపై తీవ్ర విమర్శలు చేస్తూ ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చి కార్యాలయం ముందు ఖాళీ బిందెలను పెట్టి బైటాయించి తమ నిరసన వ్యక్తం చేశారు.గ్రామపంచాయతీ కార్యదర్శి జ్యోతి, సిబ్బంది, ప్రత్యేక అధికారి సాయి చైతన్య లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అదే సమయంలో రోడ్డుపై బైటాయించి ఖాళీ బిందెలతో నినాదాలు చేశారు. బస్సులను ఇతర వాహనాలను వెళ్లకుండా అడ్డుకున్నారు. నీటి సమస్య అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఉందని వారు ఆరోపించారు.నల్లాల ద్వారా వస్తున్న నీరు కూడా కలుషితంగా ఉందన్నారు. దీంతో తాము రోగాల బారిన పడుతున్నామంటూ ఆరోపించారు. తమను మనుషులుగా చూడడం లేదని సమస్యను చెప్పిన పట్టించుకోవడంలేదని అదేమిటి అని ప్రశ్నిస్తే ఆగ్రేస్తున్నారు అంటూ తీవ్రంగా స్పందించారు. ఈ విషయంపై గ్రామంలో అశాంతి వాతావరణం నెలకొంది. పరిస్థితుల విషయమించక ముందే రాబిట్ చర్యలు తీసుకోవాలంటూ కొందరు గ్రామస్తులు హెచ్చరించారు. గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి కార్యదర్శి లు స్పందించి గ్రామంలో ఉన్న నీటి బోరును వాడకంలోకి తీసుకువచ్చేలా తాత్కాలికంగా పైపులను రిపేర్ చేశారు. దీంతో తాత్కాలికంగా సమస్య సద్దుమణిగింది. గ్రామాన్ని సందర్శించిన ఆర్‌డబ్ల్యూఎస్ డీ.ఈ. ఈ బృందం : ఈ విషయం తెలిసిన వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కరుణాకర్, ఎంపీఓ కిషన్, ప్రత్యేక అధికారి సాయి చైతన్య బృందం గ్రామాన్ని సందర్శించారు. పరిస్థితిపై సెక్రటరీ జ్యోతిని అడిగి తెలుసుకున్నారు. ఒకటిన్నర రోజులపాటు నీటి సరఫరా కాలేదని, గేట్ వాల్ రిపేర్ వల్ల ఈ ఇబ్బంది కలిగిందని జ్యోతి అధికారికి వివరించారు. గ్రామస్తులు మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీరుమురికిగా ఉంటుందని స్నానాలు చేయడం వంట వండుకోవడం వల్ల జ్వరం దురద అనారోగ్యం కలుగుతున్నాయని తెలిపారు.మిషన్ భగీరథ నీటిని శాంపిల్ సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్ కు పంపనున్నట్లు డీఈ కరుణాకర్ ప్రజలకు తెలిపారు. వర్షాలు పడుతున్న కారణంగా కొద్ది రోజులు ఎరుపు రంగులో నీరు వస్తుందని ప్రజలకు చెప్పారు. దీంతో గ్రామంలో తాత్కాలికంగా సమస్యకు తెరపడింది.

ఉత్తమ రైతు పురస్కారాలు అందుకున్న జిల్లా వాసులు

- ఏరువాకకేంద్రం ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ బి.అనిల్‌కుమార్

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం పదో వార్షికోత్సవం సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి ఇద్దరు రైతులు రైతు పురస్కారాలకు ఎంపిక కాగా, మంగళవారం వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ లో ఉత్తమ రైతు పురస్కారాలను యాదాద్రి జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.అనిల్‌కుమార్‌తో కలిసి అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానశాస్త్రవేత్త అనిల్‌కుమార్ మాట్లాడుతూ భువనగిరి మండలం చందుపట్ల గ్రామానికి చెందిన మందాడి సిద్ధారెడ్డి, రాజపేట మండలం నెమిలి గ్రామానికి చెందిన మేక వెంకటేశ్వర్‌రెడ్డి ఇద్దరు ఎంపికయ్యారన్నారు. కాగా వీరు వరి, పత్తి పంటలలో అధిక సాంద్రత పద్ధతి, కూరగాయ పంటలో ఉత్తమ యజమానియా పద్ధతులను పాటించడం, అధిక దిగుమతులను పొందుతూ ఇదర రైతులకు ఆదర్శంగా నిలిచారు. విత్తనాలు, పురుగుమందుల కొరత గ్రామంలో ఉండకూడదని ఎఫ్‌పీఓ సహాయంతో చందుపట్ల గ్రామంలో ఇన్పుట్ స్టాల్‌లో ఏర్పాటు చేయడం, గ్రామాల్లో ఉత్పత్తి అయిన కూరగాయలను మంచి ధరకు విక్రేచ్చే విధంగా భువనగిరి రైతు ఉద్యమ రైతుఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ద్వారా రైతుబజార్ ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించారు.వ్యవసాయ విశ్వ విద్యాలయం ద్వారా విడుదలైన వినికిట్టు చిరుసంచుల రకాలను నూతన సాంకేతిక పద్ధతులను పాటించడంలో, రైతులకు నూతన సాంకేతికపరిజ్ఞానాన్ని అందించడం, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ నిర్వహించే ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొని , రసాయనాలు వాడకాలు తగ్గించడంలో కృషి చేశారు. నూతన వంగడాలు టమాటో సాగులో మల్చింగ్, టేకింగ్ పద్ధతులు అంశాలలో నైపుణ్యం, ప్రతి ఏటా వ్యవసాయ కళాశాల విద్యార్థులను గ్రామీణ కృషి అనుభవాలను అందిస్తూ దిశానిర్దేశం చేయడంతో ఇద్దరు ఉత్తమ రైతు పురస్కారాలు అందుకున్నట్లు తెలిపారు.



నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన వ్యక్తి వీరస్వామి

నవతెలంగాణ-గరిడేపల్లి



నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఎర్రజెండా నాయకత్వంలో పోరాడిన వ్యక్తి వీరస్వామి అని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎస్ కే యాకూబ్ అన్నారు. మండల పరిధిలోని తాళ్ల మల్కాపురం గ్రామంలో వట్టికూటి వీరస్వామి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందగా ఆయన పార్థీవ దేహంపై ఎర్రజెండా పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళానికి సద్దులు మోయడం రాష్ట్ర సమాచారం ఇవ్వడం గ్రామాలలో ఏదైనా జరిగిన ముందుండి పోరాడడం జరిగిందన్నారు. ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) మండల కమిటీ తరపున సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి వట్టికూటి అంజయ్య రాంబాబు మాజీ సర్పంచ్ ఏమోగానీ వెంకటేశ్వర్లు కోట బాలయ్య చంద్రయ్య పుల్లయ్య పాల్గొన్నారు.

గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తి భావంతో నిర్వహించాలి :ఏసీపీ రమేశ్‌కుమార్

నవతెలంగాణ-ఆలేరుటౌన్



గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిభావంతో నిర్వహించాలని ఏసీపీ రమేశ్‌కుమార్ అన్నారు.ఆలేరు మండల కేంద్రంలో మంగళవారం రానున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని, ఉత్సవ కమిటీ సభ్యులకు అవగాహనా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతి నవరాత్రోత్సవాలకు, అనుమతులు తీసుకోవాలని, ప్రభుత్వ ఆదేశాలు పాటించాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ముందస్తు చర్యలు తీసుకుంటుందన్నారు.ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి,ఎంపీడీఓ సత్య ఆంజనేయప్రసాద్, మున్సిపల్ కమిషనర్ కే.లక్ష్మీ, సీఐ కొండల్‌రావు, ఆలేరు ఎస్సై రజనీకర్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

11వ రోజు ఇండియాకు ప్రవీణ్ మృతదేహం

- స్వగ్రామం పాతర్లపహాడ్‌లో అంత్యక్రియలు

నవతెలంగాణ-ఆత్మకూర్‌ఎస్




అమెరికాలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఆత్మకూర్ ఎస్ మండలం పాతర్ల పహాడ్ గ్రామానికి చెందిన తప్సి ప్రవీణ్ కుమార్ మృతదేహం పదకొండు రోజులకు పాతర్లపాడులో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన ప్రవీణ్ కుమార్ దేహాన్ని 11 రోజులకు స్వగ్రామమైన పాతర్లపాడుకు అమెరికా నుండి తీసుకొచ్చారు. మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు ప్రోద్బలంతో కేంద్ర హెూంశాఖ మంత్రి బండి సంజయ్ సహకారంతో ప్రవీణ్ కుమార్ మృతదేహాన్ని ఇండియాకు తెప్పించారు. పాతర్లపాడు గ్రామానికి చెందిన తప్సి నాగయ్య కు ఇద్దరు కుమారులు ఒక కూతురు ఉండగా మృతుడు ప్రవీణ్ చిన్న కుమారుడు. గత ఐదేళ్ల క్రితం తన మిత్రుల సహకారం తో అమెరికా వెళ్లి న్యూ మెక్సికో ప్రాంతంలో ఉపాధ్యాయునిగా పని చేస్తూ ఆగస్టు 23న మృతి చెందాడు. మంగళవారం ఉదయం పాతర్లపాడు చేరుకుంది. అనంతరం మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

తగ్గుముఖం పట్టిన వరద ఉధృతి

- 26 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల
- 3,04,155 క్యూసెక్కుల ఇన్ ఫ్లో

నవతెలంగాణ-నాగార్జునసాగర్

నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు మూడు రోజుల నుండి 5లక్షల క్యూసెక్కుల పై చిలుకు భారీ వరద ఉధృతి పెరిగి కృష్ణమ్మ ఉగ్రరూపాన్ని దాల్చింది.మంగళవారం కొంతమేర వరద తగ్గుముఖం పట్టడంతో కృష్ణమ్మ శాంతించింది.ఎగువ కృష్ణానది పరివాహక ప్రాంతాల నుండి శ్రీశైలం జలాశయంకు వరద కొనసాగుతుండటంతో క్రష్ట్ గేట్లను ,జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 3,04,155 క్యూసెక్కుల వరద నీటిని దిగువనున్న నాగార్జునసాగర్ రిజర్వాయర్ కు విడుదల చేస్తున్నారు.దీనితో నాగార్జునసాగర్ డ్యామ్ 26క్రష్ట్ గేట్లను ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.10 గేట్లను 10 అడుగులు,16 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,64,642 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



నాగార్జునసాగర్ డ్యామ్ సమాచారం

నాగార్జునసాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 585.90 అడుగులవద్ద నీరు నిల్వవుంది.డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 300.0315 టీఎంసీల నీరు నిల్వ ఉంది.జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 29,435 క్యూసెక్కుల నీటిని,కుడి కాలువ ద్వారా 7678 క్యూసెక్కుల నీటిని,ఎడమ కాల్వద్వారా నీటి విడుదల లేదు,ఎస్.ఎల్.బి.సి ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని,లోలేవల్ కెనాల్ ద్వారా 600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ నుండి వచ్చిన నీటిని వచ్చినట్లు మొత్తం 3,04,155 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

గర్భిణులకు పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-భువనగిరికలెక్టరేట్

బాలింతలకు, గర్భిణులు, పిల్లలకు పోషకాహారం పకడ్బందీగా అందించాలని, పోషకాహార లోపాన్ని నివారించేలా కృషి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు కె.గంగాధర్ సూచించారు.మంగళవారం కలెక్టరేటు సమావేశ మందిరంలో సీడీపీఓలు, సూపర్వైజర్లు, హెల్త్ డిపార్టుమెంట్ ఎంఎల్‌హెచ్‌పీ, వైద్య అధికారులకు జరిగిన పోషణ మాసం కార్యక్రమం, పర్యవేక్షణతో కూడిన ఆహార పద్ధతులపై ఒక్కరోజు శిక్షణకు హాజరై మాట్లాడారు.బాలింతలు, గర్భిణులు 0-5లోపు పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని పకడ్బందీగా అందించాలని తెలిపారు. ఈనెల ఒకటవ తేదీ నుండి 30 వ తేదీ వరకు జిల్లా లోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో పోషణ మాసం నిర్వహిస్తున్నందున పిల్లల బరువు, ఎత్తు నమోదు చేయడం, లైన్ డిపార్టుమెంట్స్ సమన్వయంతో వయస్సుకు తగిన బరువు, ఎత్తు లేని పిల్లలకు పర్యవేక్షణతో కూడిన ఆహారాన్ని అందిస్తూ వైద్య పరీక్షలు చేయించాలన్నారు. తక్కువ బరువు వున్న పిల్లలకు ఆకలి పరీక్షలు నిర్వహించాలని, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని,డాక్టర్ సలహాల మేరకు పోషకాహార పునరావాస కేంద్రాలకు పంపాలని సూచించారు.అనంతరం పోషణ మాసం పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ యశోద, డాక్టర్ మనోహర్, డాక్టర్‌శిల్పిని, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ వీణ పాల్గొన్నారు.



తాళ్లసింగారం గ్రామాన్ని సందర్శించిన జిల్లా వ్యవసాయాధికారి

నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని తాళ్లసింగారం గ్రామాన్ని మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ సందర్శించారు. రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతు రుణమాఫీకి సంబంధించి 18,072 దరఖాస్తులు ఉండగా ఇప్పటివరకు 5372 దరఖాస్తులు పూర్తయినట్టు తెలిపారు. మిగిలిన దరఖాస్తులను త్వరితగతిన పూర్తిచేయనున్నట్టు తెలిపారు.అంతకుముందు రైతు రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎస్.లింగోటం, తాళ్లసింగారం గ్రామాల్లో రుణమాఫీ జాబితాలో పేరు ఉండి రేషన్‌కార్డులు లేని రైతుల నుండి కుటుంబ సభ్యుల వివరాలను మండల వ్యవసాయాధికారి ముత్యాల నాగరాజు రుణమాఫీ యాప్‌లో ప్రత్యక్షంగా కుటుంబ సభ్యుల ఫొటోలు అప్‌లోడ్ చేశారు. చౌటుప్పల్ మండలంలో 1623 దరఖాస్తులకుగాను ఇప్పటి వరకు 424 దరఖాస్తులను అప్‌లోడ్ చేసినట్టు తెలిపారు. మిగిలిన దరఖాస్తులను షెడ్యూల్ ప్రకారం త్వరలో పూర్తిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు శంకరయ్య, కృష్ణ, లావణ్య, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



42 శాతం రిజర్వేషన్ అమలుపరిచాకే ఎన్నికలు నిర్వహించాలి

నవతెలంగాణ-తిరుమలగిరి



బీసీ కులగణన చేసి స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలుపరచి ఎన్నికలు నిర్వహించాలని బీసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తన్నీరు రాంప్రభు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కులగణన త్వరితగతిన జరిపి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలుపరచాలని కోరుతూ బీసీ హిందూ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్ పటేల్ హైదరాబాదులోని గాంధీ హాస్పిటల్ లో ఆమరణ నిరాహార దీక్ష పదవ రోజుకు చేరుకోవడం జరిగిందని, ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న వారిని పరామర్శించడానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తన్నీరు రాంప్రభు గాంధీ హాస్పిటల్ వెళ్లి మాట్లాడారు. సుధీశ్వర్ పది రోజులుగా ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తగట్టు మల్లయ్య,వంగరి బ్రహ్మం, పత్తేపురం యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ పీఆర్‌టీయూ మండల కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-పెద్దఅడిశర్లపల్లి




టీఎస్‌పీఆర్‌టీయూ మండల కార్యవర్గాన్ని మంగళవారంమండలకేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఎన్నికల అధికారులు మంచికంటి మధు,మొక్కా పరశురాం గౌడ్ సమక్షంలో ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షునిగా కేతావత్ మున్నానాయక్, ప్రధానకార్యదర్శిగా రెడ్డిమణి అనిల్ కుమార్‌ను,ప్రాథమిక సభ్యులు మండల కార్యవర్గాన్ని రెండు సంవత్సరాల కాలపరిమితికిగాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతులు,వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.తమ ఎన్నికకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాశం నారాయణ రెడ్డి, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

డిగ్రీలో చేరడానికి ఆఖరి అవకాశం

నవతెలంగాణ -నకిరేకల్

ఇంటర్ ఉత్తీర్ణులై దోస్త్‌లో అప్లై చేసి ఇప్పటి వరకు ఎక్కడా సీటు పొందనివారికోసం, అసలు దోస్త్ లో రిజిస్ట్రేషన్ చేసుకోకుండా ఉండి డిగ్రీ చదివే ఆఖరి అవకాశంగా ప్రవేశాల స్పెషల్ డ్రైవ్ ఈ నెల 4 నుండి 9 వరకు కొనసాగుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నకిరేకల్ ప్రధానాచార్యులు డా. బెల్లి యాదయ్య తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పాసై వివిధకారణాల వల్ల డిగ్రీ చేయలేకపోయిన నకిరేకల్ ప్రాంత యువత స్పెషల్ డ్రైవ్ ను వినియోగించుకోవాలన్నారు. స్పెషల్ డ్రైవ్ లో నకిరేకల్ పట్టణంలోనే కాకుండా ఆయా గ్రామాల్లోని ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ డిగ్రీలో చేరేందుకు తమవంతుగా తల్లిదండ్రులు, విద్యావంతులు, ప్రజాప్రతినిధులు కళాశాలకు సహాయసహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. స్పెషల్ డ్రైవ్ ప్రవేశాల రిజిస్ట్రేషన్ మరియు ఆప్షన్స్ పెట్టడం కోసం కళాశాలలో 'దోస్త్ హెల్ప్ లైన్' కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ఎస్ఐ ప్రసాద్ కు సన్మానం

నవతెలంగాణ - త్రిపురారం

మండల నూతన ఎస్ఐగా వచ్చిన ప్రసాద్‌ను కాంగ్రెస్ మండల నాయకులు మంగళవారం సన్మానించారు.ఈ కార్యక్రమంలో భాస్కర్ నాయక్,అనుముల వెంకట్ రెడ్డి, అనుముల నర్సిరెడ్డి,పీబీ శ్రీను,భరత్ రెడ్డి,నాగనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీ కళాశాలలో డిగ్రీ స్పెషల్ డ్రైవ్ అడ్మిషన్లు

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్

నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చివరి దశ అడ్మిషన్ల కోసం దోస్త్ స్పెషల్ డ్రైవ్ విడుదల అయినట్టు ప్రిన్సిపాల్ డా. సముద్రాల ఉపేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు ఈ నెల 4వ తేది నుంచి 9 వ తేది లోపు దోస్త్ వెబ్ సైట్ లో రూ. 400 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. దివ్యాంగులు, ఎన్ సి సి, స్పోర్ట్స్, అదనపు సహ పాఠ్యాంశాలలో ప్రతిభ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. వెబ్ ఆప్షన్లు ఈ నెల 9వ తేదీలోపు ఇవ్వాలని తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా 9వ తేదీనే ఉంటుందని పేర్కొన్నారు. సీట్ల కేటాయింపు ఈ నెల 11వ తేదీన జరుగుతుందని, సీట్లు పొందిన అభ్యర్థులు ఈ నెల 13వ తేదీలోపు ఆన్ లైన్ లో సెల్ఫ్ రిపోర్ట్ చేయాలని తెలిపారు. ఇంతకు ముందు రిజిస్ట్రేషన్ చేయించుకొని సీట్లు పొందని వారు, రిజిస్ట్రేషన్ చేయించుకోనివారు ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకొని దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

వరద బాధితులకు సహాయక చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ -ఆలేరుటౌన్

వరద బాధితులకు సహాయక చర్యలు చేపట్టాలని,నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లేపు అడవయ్య కోరారు.మండల కేంద్రంలో మంగళవారం డెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు వరదలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మామిడాల బిక్షపతి, డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్, జిల్లా అధ్యక్షులు మామిడాల సోమయ్య, నాయకులు ఇక్కిరి సహదేవ్, నేరేడు స్వామి, అన్‌రెడ్డి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.5వేల ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-రాజాపేట

రాజాపేట మండలం రఘునాథపురం గ్రామంలో బుడిగే పెంటయ్య కుటుంబం ప్రజల మధ్యనే ఉంటూ సేవాసహాయ సహకారాలు అందిస్తూనే ఉన్నారు. ఇటీవల దాసరి ఉపేందర్ అనారోగ్యంతో మరణించగా ఆ కుటుంబానికి రఘునాథపురం తాజా మాజీ ఎంపీటీసీ బుడిగే రేణుకపెంటయ్యగౌడ్ మంగళవారం పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు బింగి రమేష్‌నేత, బల్ల మురళీ నేత, రచ్చ నర్సింహులు నేత, కటకం గణేష్ నేత, కటకం శివ నేత, కటకం సత్యనారాయణ నేత, చెన్న శ్రీనివాస్‌నేత పాల్గొని బుడిగే రేణుక పెంటయ్యగౌడ్‌కు కృతజ్ఞతలు చెప్పారు.

పోషణ అభియాన్ మాసం

నవతెలంగాణ –చిట్యాల

మున్సిపాలిటీ పరిధిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అంగన్వాడి మొదటి సెంటర్లో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రోజా మాట్లాడుతూ పోషకాహారం గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు పోషక విలువలు ఉన్న ఆకుకూరలు ,పండ్లు, పాలు, గుడ్లు ,చేపలు ,మొలకెత్తిన గింజలు, రాగులు, జొన్నలు ప్రతినిత్యం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీఎస్ ఉపాధ్యాయురాలు సరిత, భవితస్కూల్ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, అంగన్వాడి టీచర్స్ దాడి అరుణ, ఎన్ అపర్ణ బుజ్జమ్మ జ్యోతి శోభారాణి కృష్ణవేణి వరమ్మ పుష్పలత పాల్గొన్నారు .

పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యం

- **డిప్యూటీ తహసీల్దార్ తారకరామన్**

నవతెలంగాణ-మర్రిగూడ

పిల్లలు ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యమని డిప్యూటీ తహసీల్దార్ తారక రామన్ అన్నారు. మంగళవారం మండలంలోని తిరుగండ్లపల్లి అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాస ఉత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చిన్న పిల్లల తల్లులకు,గర్భిణులకు , చిన్నారులకు పాలు,గుడ్లు,బాలామృతం,పౌష్టికాహారంతో కూడిన భోజనం అంగన్వాడి కేంద్రాలలో అందజేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఐసిడిఎస్ సూపర్వైజర్ యశోద మాట్లాడుతూ ఆరు నెలల వరకు చిన్నారులకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. అనంతరం ఆరు నెలల చిన్నారులకు అన్నప్రాసన,మూడు సంవత్సరాల చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు శ్రీదేవి,నిర్మల,ఆయా అబ్బమ్మ,తల్లులు పాల్గొన్నారు.



విద్యుద్ఘాతంతో రైతు మృతి

నవతెలంగాణ -కొండమల్లేపల్లి



విద్యుద్ఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మంగళవారం మండల పరిధిలోని చిన్న అడిచర్లపల్లి గ్రామ సమీపాన ఉన్న శివ గణేష్ కాటన్ మిల్ లో చోటుచేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న అడిశర్ల పల్లి గ్రామానికి చెందిన రైతు రావుల వెంకటయ్య (52) ఉదయం పొలం పనులు ముగించుకొని సాయంత్రం నాలుగు గంటల సమయంలో పొలం పక్కనే ఉన్న శివ గణేష్ కాటన్ మిల్ లోకి పని నిమిత్తం వెళ్లగా ఆ సమయంలో మిల్లు కార్మికులు ఉండే గదిలో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశత్తు విద్యుత్ వైరు తగిలి వెంకటయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే మిల్లు వద్దకు చేరుకొని వెంకటయ్య మృతదేహాన్ని చూసి కన్నీరు మున్నీరవుతూ బోధిస్తూ మిల్లు యజమాని నిర్లక్ష్యం కారణంగానే వెంకటయ్య మృతి చెందాడంటూ మిల్లు యజమాని వచ్చి తమకు నష్టపరిహారం చెల్లించేంతవరకు మృతదేహాన్ని ఇక్కడి నుంచి తీయబోమని బిస్మించి నిరసనకు దిగడంతో విషయం తెలుసుకున్న సీఐ ధనుంజయ గౌడ్, ఎస్సై రామ్మూర్తి, గుడిపల్లి ఎస్ఐ నరసింహులు సంఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించి ప్రభుత్వపరంగా ఆదుకునే విధంగా కృషి చేస్తామని మృతుని కుటుంబ సభ్యులకు నచ్చజెప్పిన వినకపోవడంతో మృతుని కుటుంబ సభ్యులు బంధువులు మృతదేహంతో మిల్లు వద్దనే ఉండిపోయారు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మాజీ మంత్రులపై దాడి హేయమైన చర్య

- **మాజీ ఎంపీపీ గుండగాని కవిత రాములు గౌడ్**

నవతెలంగాణ-తుంగతుర్తి

ఖమ్మంలో వరద బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీశ్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, సబితా ఇంద్రారెడ్డి వాహనాలపై కాంగ్రెస్ గుండాలు దాడి చేయడం హేయమైన చర్య అని మాజీ ఎంపీపీ గుండగాని కవితా రాములు గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేతకానితనం వలన ఖమ్మం జిల్లాకు వరదల వల్ల చాలా నష్టం జరిగిందని అన్నారు. దాడులకు పాల్పడిన వారు ఎంతటి వారైనా అరెస్టు చేసి చట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డోజర్ ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

నవతెలంగాణ- చండూరు

డోజర్ బండి ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం మున్సిపల్ కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాస్కానిక్ గూడెం గ్రామానికి చెందిన వర్కాల సత్తయ్య (70) తన భార్యతో పాటు కలిసి చండూరుకు వస్తున్న క్రమంలో స్థానిక స్మశాన వాటిక దగ్గర రాగానే మున్సిపాలిటీ వారు డోజర్ బండితో చర్ల శుభ్రం చేస్తున్న క్రమంలో ప్రమాదవశత్తు బైక్ పై వస్తున్న సత్తయ్య అతని భార్య కు గాయాలు అయ్యాయి. సత్తయ్య కు బలమైన గాయలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని బిడ్డ ఇచ్చిన ఫిర్యాదు మేరాకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెంకన్న తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-రామన్నపేట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేట లో 2024-25 విద్యా సంవత్సరానికి అతిథిఅధ్యాపక పోస్టుల నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాహత్‌ఖానం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.సబ్జెక్టుల వారీగా ఖాళీలు ఇంగ్లీష్-1, తెలుగు-1, పొలిటికల్ సైన్స్-1, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-1, మరియు కామర్స్-1 ఉన్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు గాను సంబంధిత సబ్జెక్టు పిజీలో జనరల్, బీ.సి అభ్యర్థులు 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలు అయితే 50శాతం మార్కులు ఉన్నవారు అర్హులని, ఎంపిక లో నెట్, సెట్ పీహెచ్డీలతో పాటు బోధనా అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.ఆసక్తి కలవారు ఈ నెల 6 సాయంత్రం మూడు గంటలలోపు ప్రభుత్వ డిగ్రీకళాశాల రామన్నపేటలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.ఇంటర్వ్యూ తేదీని దరఖాస్తులు చేసిన అభ్యర్థులకు తెలియజేస్తామని తెలిపారు.నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం కోరారు.

మా డిగ్రీ కళాశాల మాకే కావాలి

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ డిగ్రీ పురుషుల గురుకుల కళాశాలను అనంతారం, భువనగిరి మండలం యాదాద్రి భువనగిరి జిల్లా నుండి తరలించకుండా ఆపాలని కోరుతూ మంగళవారం భారతీయ యువ మోర్చా, బీజేవైఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవో సి.జగన్మోహన్‌ప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు.వినతిపత్రం అందజేసిన వారిలో బీజేవైఎం నాయకులు బూరుగు మణికంఠ, మంగు నర్సింహారావు,బట్టు క్రాంతి, పల్లెపాటి వేణుగోపాల్, రాళ్లబండి కృష్ణాచారి, కానుకుంట్ల రమేష్, కొలిచెలిమ మల్లికార్జున్,భువనగిరి సిద్దుగౌడ్, నూనెబాలకృష్ణ, బొజ్జ శివప్రసాద్ ఉన్నారు.

పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

- **జిల్లా షెడ్యూల్ కులములు అభివృద్ధి అధికారి ఎం.జయపాల్‌రెడ్డి**

నవతెలంగాణ-భువనగిరికలెక్టరేట్

2024-25 విద్యాసంవత్సరానికి గానూ జిల్లా లోని ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలల యందు చదువుచున్న విద్యార్థినీ / విద్యార్థులు పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలు (ఫ్రెష్, రెన్యువల్) కోసం ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి ఎం.జయపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో 100 పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలు (ఫ్రెష్ , రెన్యువల్) ఉపకార వేతనాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేసుకొనుటకు సెప్టెంబర్ 4 నుంచి 31 వరకు కళాశాల యాజమాన్యాలు విద్యార్థినీ / విద్యార్థుల ఉపకారవేతనాల నమోదు ప్రక్రియ 100 శాతం జరిగేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థినీ / విద్యార్థుల యొక్క బ్యాంక్ అకౌంట్ వివరాలు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు.విద్యార్థుల ఉపకారవేతనాల నమోదు ప్రక్రియ పోస్ట్‌మెట్రిక్ (ఫ్రెష్ , రెన్యువల్) కోసం ఈ-పాస్ వెబ్ సైట్ http:// telanganaepass. cgg.gov.in నందు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఘనంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-రామన్నపేట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మండలంలోని వెల్లంకి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు, పెన్నులు బహుమతిగా అందజేశారు.ఈ కార్యక్రమంలో తుడి సంజయ్,నకిరేకంటి గణేష్, మనుసూరి ప్రదీప్, గుర్రం మహేష్, బండ్లహరీష్, పోచబోయిన మల్లేష్, కేశబోయిన అంజి, తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు